RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 272 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 అక్టోబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపండి : మోదీ

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష నిర్వహించారు. అక్కడ వరుసగా ఉగ్రదాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమ య్యారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాల మోహరింపు, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో కూడా మాట్లా డినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని మోదీ ఆదేశించినట్లు వెల్లడించాయి. పూర్తిస్థాయి సామర్థ్యాలను వినియోగించుకొని ఉగ్రవాదులను అణచివేయాలని పేర్కొన్నట్లు తెలిపాయి. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా ప్రధాని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు.




## తిగిరి విధుల్లోకి తీసుకునేందుకు కసరత్తు

హైదరాబాద్ : వీఆర్వోలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మళ్లీ వారిని తిగిరి విధుల్లోకి తీసుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో వీఆర్వోల అంశంపై మాట్లాడారు. గత ప్రభుత్వం వ్యవస్థను ధ్వంసం చేసిందని అన్నారు. అందుకే వీఆర్వో వ్యవస్థను మళ్లీ ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని తెలిపారు. అంతే కాదు.. ధరణి పోర్టల్ పేరును కూడా మార్చుతున్నారని కీలక ప్రకటన చేశారు. ధరణి పేరుతో ఇష్టానుసారం దోచుకున్నవారిని తప్పకుండా జైలుకు పంపుతామని కీలక వ్యాఖ్యలు చేశారు.

# ప్రభుత్వం పై నమ్మకం ఉంది

## సీఎంతో భేటీ అనంతరం ఉద్యోగ జేఏసీ నేతలు



హైదరాబాద్ : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని, బదిలీలు, సర్వీసు అంశాలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు అన్నారు. ఇవాళ బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీవో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జేఏసీ ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో సీఎం దాదాపు 3 గంటల పాటు ఉద్యోగ సంఘాలతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జేఏసీ నేతలు.. తమ సమస్యలను సీఎం క్షుణ్ణంగా విన్నారని ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, ఆర్థిక సంబంధమైన సమస్యలను ఆర్థిక శాఖ మంత్రితో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా డీఏ విషయంలో ఆర్థిక మంత్రితో చర్చించి రేపు సాయంత్రం వరకు ప్రకటన చేస్తామన్నారని తెలిపారు. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్ల విషయంలోనూ సానుకూలంగా స్పందించారన్నారు.

**ఆ జేఏసీ మాటలు ఉద్యోగులు నమ్మొద్దు...** తమ డిమాండ్ల సాధనలో ఇది మొదటి మెట్టు ఉద్యోగులు పేర్కొన్నారు. 317 జీవో అంశంపై ప్రస్తుతం సబ్ కమిటీ పని చేస్తున్నందున జేఏసీ నేతలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారన్నారు. ఆర్థిక పరమైన అంశాలపై ఓ కమిటీని వేయబోతున్నట్లు సీఎం వెల్లడించారన్నారు. త్వరలో మరోసారి జేఏసీతో భేటీ అవుతానని చెప్పారన్నారు. 'నేను మీ కుటుంబ సభ్యుడినని, మీ అన్నలాంటి వాడిని, మీ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది, ఆందోళన అక్కర్లేదు' అని భరోసా ఇచ్చారని ఉద్యోగులు తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగసంఘాలపై తమ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు తీసుకోబోమని చెప్పారన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం స్పష్టమైన హామీ ఇచ్చినందున మధ్యవర్తులను, వేరే జేఏసీ పేరుతో మాట్లాడుతున్నవారి మాటలను ఉద్యోగులు నమ్మవద్దని కోరారు. వేరే శాఖల్లోకి వెళ్లిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటామని సైతం సీఎం చెప్పారన్నారు.



## గత సీఎం.. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా?

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికి? అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును భాజపా ఖండిస్తోందన్నారు. భాజపా ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. "డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎట్లా చేస్తావ్ రేవంత్.. నిన్ను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసింది. వాటిని భారాస స్థిరాస్తి వ్యాపారులు పేదలకు విక్రయించారు. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారు. చెరువులన్నీ క్లీన్ చేయండి అభినందిస్తాం. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడండి. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు. అందులో విష రసాయనాలు కలుస్తున్నాయి. వాటిని అరికట్టి డైవర్షన్ చెయ్యి చాలు. ఎక్కడైనా ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? పనిచేస్తే ఇంకా దుర్గంధం ఎందుకుంది. గత సీఎం హుస్సేన్ సాగర్‌ను ఎందుకు బాగు చేయలేదు. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా? పేదల ఉసురు మంచిది కాదు.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం. శుక్రవారం జరిగే మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి" అని ఈటల పిలుపునిచ్చారు.

## లైఫ్ సైన్సెస్‌కు ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయింది. రైన్‌ల్యాండ్ మంత్రి డానియెల్ బృందం, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కలిసి పెట్టుబడులపై మంత్రితో చర్చించారు.

ఫార్మా ఉత్పత్తులు, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్‌లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వాములు కావడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణ అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా జర్మనీ బృందానికి శ్రీధర్ బాబు తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ప్రపంచ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణ ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు అత్యున్నత మౌలిక సదుపాయాలతో పరిశ్రమ దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. హైదరాబాద్‌లో జరిగే బయో ఆసియా-2025 సదస్సుకు హాజరు కావాలని శ్రీధర్ బాబు.. ప్రతినిధుల బృందాన్ని కోరారు. రైన్‌ల్యాండ్, తెలంగాణ రాష్ట్రాలు ఇకపై పరస్పర సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. రైన్‌ల్యాండ్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించాలని మంత్రి డానియెల్ బృందం శ్రీధర్ బాబును ఆహ్వానించింది.

## సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్..

### రూ.358 కోట్లు విడుదలకు భట్టి ఆదేశాలు



హైదరాబాద్: దీపావళి కానుకగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను శుక్రవారమే చెల్లిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటించారు.

దీని కోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది.

ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలిచ్చారు. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసిందని సింగరేణి సీఎండీ తెలిపారు.

# 'బిజెపి' వైపే మొగ్గు!

## 155-160 సీట్లతో అధికారంలోకి పక్కానా...!?



## మహారాష్ట్రలో గెలుపెవరిదో తేల్చేసిన ఆరెస్సెస్ సర్వే..!!

మహారాష్ట్రలో హెూరా హెూరీ సమరంలో గెలుపెవరిది. జమిలి ఎన్నికల ప్రచారం వేళ మహారాష్ట్ర, జారండ్ లో ఎన్నికల ఫలితం పైన రాజకీయంగా ఉత్కంఠ కొనసాగుతోంది. మహారాష్ట్రలో రెండు ప్రధాన కూటముల మధ్య పోరు కొనసాగుతోంది.

హర్యానా గుణపాఠంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. అదే హర్యానాలో బీజేపీ గెలుపు కోసం పని చేసిన ఆరెస్సెస్ మహారాష్ట్రలోనూ పని మొదలు పెట్టింది. వేలాది మీటింగ్ ల ద్వారా ప్రజలకు దగ్గరవుతోంది. ఇదే సమయంలో ఆరెస్సెస్ అంతర్గత సర్వేలో మహారాష్ట్ర ఫలితం ఏంటనేది స్పష్టత వచ్చింది.

**రంగంలోకి సంఘ్ పరివార్ :** మహారాష్ట్రలో ఎంవీఏ, మహాయుతి కూటములు సీట్ల సర్దుబాటు పై ఒక నిర్ణయానికి వచ్చాయి. అభ్యర్థుల ఖరారు పై తుది కసరత్తు చేస్తున్నాయి. హర్యానాలో బీజేపీ గెలుపు కోసం ఆరెస్సెస్ క్రియాశీలకంగా పని చేసింది. కార్నర్ మీటింగ్ ల ద్వారా ప్రజలకు దగ్గరవుతూ బీజేపీకి అనుకూలంగా ఓటర్లను దగ్గర చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.

ఇప్పుడు మహారాష్ట్ర లోనూ ఆరెస్సెస్ శ్రేణులు రంగంలోకి దిగాయి. ప్రజల్లో మహాయుతి కూటమికి అనుకూలంగా అభిప్రాయం కలిగేలా ప్రచారం ప్రారంభించాయి. ముందుగా బీజేపీకి ఉన్న విజయావకాశాల పైన ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు ఆరెస్సెస్ చేసిన సర్వేలో ఆసక్తి కర ఫలితాలు వచ్చాయి.

**బీజేపీ కూటమి వైపే మొగ్గు :** లోక్ సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎంవీఏ కు బీజేపీ కంటే అనుకూలత కనిపించింది. కానీ, ఆరెస్సెస్ అంతర్గతంగా రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలో అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. అరెస్సెస్ నిర్వహించిన సర్వేలో బీజేపీ కూటికి 155- 160 సీట్ల వరకు వచ్చే అవకాశం ఉందని తేలింది. అందులో బీజేపీ దాదాపు 90 సీట్ల వరకు గెలిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మిత్రపక్షాలుగా ఉన్న అజిత్ పవార్ ఎన్సీపీకి 25-30 స్థానాలు, షిండే శివసేనకు 40-45 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని లెక్కలు తేల్చారు. ఏ ప్రాంతంలో బీజేపీకి అనుకూల - వ్యతిరేక పరిస్థితులు ఉన్నాయనేది ఈ సర్వేలో ఆరెస్సెస్ నేతలు గుర్తించి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

**అరెస్సెస్ ప్రచారం :** మహారాష్ట్రలో ఆరెస్సెస్ ప్రతీ గ్రామంలోని ప్రతీ ఓటరును కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అయిదు నుంచి పది మంది వరకు ప్రతీ చౌరస్తాలో కలిసి వారికి మహాయుతి గెలుపు ఆవశ్యకతను వివరించి వారి మద్దతు పొందే ప్రయత్నం చేస్తోంది. హర్యానాలో అమలు చేసిన ఫార్ములాతోనే మహారాష్ట్రలో ముందుకు వెళ్తోంది. బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ .. డెవలప్ మెంట్.. ఆర్థికంగా పురోగతి .. సంక్షేమం సాధ్యం అవుతాయని వివరిస్తున్నారు.

పబ్లిక్ ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో గుర్తించి దీనికి అనుగుణంగా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సిద్ధం చేయనున్నారు.

దీంతో.. హర్యానాలో బీజేపీ గెలుపులో సక్సెస్ అయిన ఆరెస్సెస్ మహారాష్ట్రలో ఎలాంటి ప్రభావం చూపిస్తుంది.. సర్వే ఏ మేర నిజం అవుతుందనేది తేలాల్సి ఉంది.

# సంపాదకీయం

## ప్రియాంక ఇందిర రాజ్యం తెస్తారా ?

అచ్చం నాయనమ్మ పోలిక ఆమెను భారత దేశ రాజకీయాల్లో బలమైన నేతగా నిలబెట్టవచ్చు. అయితే దానికి ఆమె శక్తిసామర్థ్యాలు మరింత రాణింపు అవసరం. ప్రియాంకా గాంధీ గురించే ఇదంతా. ఆమె కాంగ్రెస్ రాజకీయాలకు కొత్త అంటే కానే కాదు. ఆమె చాలా ఏళ్ళుగా తెర వెనక ఉంటూ తెర ముందుకు కూడా వచ్చి చాలా ఏళ్ళు అయింది. ఆమె రాహుల్ గాంధీకు బ్యాక్ బోన్ గా ఉంటున్నారు. అన్న రాహుల్ గాంధీ తో పాటుగానే ఆమె కూడా తనదైన తీరులో రాజకీయాల్లో రాణిస్తూ వస్తున్నారు. తన తల్లి సోనియాగాంధీ గెలుపు కోసం 2019లో రాయబరేలో కలియతిరిగినా తన అన్న గెలుపు కోసం ఆమె 2024లో అంతే స్ఫూర్తితో పనిచేసినా ఆమె కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాత్రమే. ఇక యూపీలో కాంగ్రెస్ కి పునరుజ్జీవం తీసుకుని రావాలని ఆమె కొన్నాళ్ళ క్రితం తపన పడ్డారు. మొత్తం కార్యక్షేత్రాన్ని యూపీగానే చేసుకుని ఆమె తన వంతుగా కృషి చేశారు. అయితే దాని ఫలితాలు మాత్రం 2024 లోక్ సభ ఎన్నికల్లో కొంతవరకూ కనిపించాయి. 2019లో కోల్పోయిన అమేధీ కూడా ఈసారి కాంగ్రెస్ పరం అయింది. అయితే దానికి పొత్తులు కూడా మరో కారణం అని చెప్పవచ్చు. ఇవన్నీ పక్కన పెడితే ప్రియాంక గాంధీ ప్రసంగాలు బాగానే ఇస్తారు. జనంలోకి చొరవగా చొచ్చుకుని పోతారు. ఆమెకు జనాకర్షణ శక్తి కూడా ఉందని తెలుస్తోంది. అయితే ఇవే కాదు రాజకీయం అంటే ప్రత్యక్ష ఎన్నికల్లో పాలుపంచుకోవాలి. ఆ విధంగా ఆమె ప్రజా ప్రతినిధిగా నెగ్గి తనను తాను రుజువు చేసుకోవాలి. చట్ట సభలలో సైతం ఆమె తన టాలెంట్ ని చూపించాలి. అందుకే ఆమెను గతంలో అనేకసార్లు పోటీ చేయమని పార్టీ శ్రేణులు కోరాయి. అయితే షర్మిల అప్పట్లో పోటీకి దిగుతారు అని చివరి దాకా వినిపించినా కూడా అది అయితే జరగలేదు. ఆమె 2024 ఎన్నికల్లో రాయబరేలీ నుంచి పోటీ చేస్తారని కూడా చివరి దాకా వినిపించింది. అలా కాదు అమేధీ నుంచి ఆమె పోటీ చేస్తారు అని కూడా అనుకున్నారు. కానీ ఆమె ఇపుడు వయనాడ్ నుంచి పోటీ పడుతున్నారు. రాహుల్ గాంధీ రాజీనామాతో ఇక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఇక ప్రియాంకా గాంధీ ఈ సందర్భంగా వయనాడ్ లో నిర్వహించిన సభ కూడా బాగానే సాగింది. అన్న రాహుల్ గాంధీతో కలసి ఆమె వచ్చారు. పవర్ ఫుల్ స్పీచ్ ఇచ్చారు. ఆమె విజయం మీద ఎవరికీ డౌట్లు లేవు. ఆ మీదట ఆమె చట్ట సభలలో అన్నకు తోడుగా ఏ విధంగా గళం వినిపిస్తారు అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. మరో వైపు చూస్తే ప్రియాంకా గాంధీ వయనాడ్ ఎంపీగా గెలిచిన తరువాత కాంగ్రెస్ లో సమూలంగా మార్పులు వస్తాయని అంటున్నారు. అన్నతో పాటుగా ఆమె కూడా పార్టీని ముందుకు తీసుకుని వెళ్ళడం తో తన వంతు పాత్రను పోషిస్తారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఇప్పటి దాకా ఇందిరమ్మ రాజ్యం తెస్తామని రాష్ట్రాల లో కాంగ్రెస్ నేతలు అంటూ వచ్చారు. ఇపుడు ప్రియాంకా గాంధీ ఆ మాట అంటే జనాలు నమ్మే అవకాశం ఉంది. అంతే కాదు ఆమె కూడా నాయనమ్మ మాదిరిగా కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్ళగలిగే సత్తాను కలిగి ఉన్నారని నిరూపించుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

# అధిక దిగుబడులు రావడం కోసం నేల సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలి: శాస్త్రవేత్త డా పుష్పజీత్ చౌదరి



శామీర్ పేట, (గరుడ వార్త) : అధిక దిగుబడులు రాబడుల కోసం నేల సారాన్ని బట్టి రైతులు పంటలు వేసుకోవాలని ఇక్రిసాట్ శాస్త్రవేత్త డా పుష్పజీత్ చౌదరి సూచించారు. ఇక్రిశాట్, లారస్ ల్యాబ్స్ ఛారిటబు ల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం, కోల్తూర్ గ్రామంలో రైతులకు మట్టి పరీక్షలు నిర్వహించి వాటికి సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లోని మట్టిని పరీక్షించిన తర్వాతే సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలన్నారు. నేల సారాన్ని బట్టి పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. రైతులు తప్పనిసరి తమ పొలంలోని మట్టిని పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్త చేతులమీదుగా హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ ంలో మేనేజర్ సి. విజయ రంగనాథ్, ఇక్రిశాట్, లారస్ ల్యాబ్స్ ఛారిట బుల్ ట్రస్ట్ ప్రతినిధులు చేతన నింజ్, లావణ్య, కుసుమ, లక్ష్మణ్ రెడ్డి, మహేంద్ర,



సుగుణ, నవీన్, వ్యవసాయాధికారులు ఏ.డి.ఏ వెంకట్రాం రెడ్డి, ఏ.ఓ.రవి కుమార్, మాజీ సర్పంచ్ శిల్పా. రైతులు పాల్గొన్నారు.

# సరదా అనుకోకు.. ప్రమాదం పాలవకు



వికారాబాద్ : ఇటీవలి వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, బావులు పొంగి పొర్లుతున్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు వస్తున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా వాటిలో దిగి ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఈత రాక నీట మునిగి 13 మంది మృతి చెందారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఇందుకోసం పిల్లలు, యువకులు నీళ్లలోకి దిగుతున్నారు. ఇలాంటి క్లిష్ట తరుణంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలపాలు కాకుండా ఉంటారు. దీనికి సంబంధించి కథనం.

తౌర్రుకుంట.. లోతు చాలా ఎక్కువ

తాండూరు పట్టణ శివారు కోకట్ గ్రామ సమీపం తౌర్రుకుంటలో నెలల తరబడి తవ్వకాలు జరపడంతో 100 నుంచి 120 అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవలి భారీ వర్షాలకు వచ్చిన వరదతో నిండుగా కనిపిస్తోంది. చెరువు సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల ఉంది. విద్యార్థులు బహిర్భూమి కోసం ఇక్కడికి వస్తుంటారు. చెరువును ఆనుకునే వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు ఉన్నాయి. ఇక్కడ వచ్చే వారు చెరువు నీటితో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లినప్పుడు అదుపు తప్పి పడిపోతే ఇక అంతే సంగతులు. నీటి పారుదల శాఖ కట్టపై హెచ్చరికగా.. 'చెరువులోకి దిగడం ప్రమాదకరం' అని రాసిన బోర్డుపై ఇప్పుడు అక్షరాలు కనిపించడంలేదు.

తాత్కాలిక ముళ్లకంచెతో సరి!

పరిగి మండలంలోని లఖ్నాపూర్ రిజర్వాయర్ జలకళను సంతరించుకోవడంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ప్రాజెక్టు మీదుగా ఏర్పాటు చేసిన నడక దారి ప్రమాదకరంగా మారింది. అక్కడికి వెళ్లకుండా అధికారులు తాత్కాలికంగా ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. కానీ ప్రజలు మాత్రం వాటిని దాటుకొని ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్తున్నారు.

తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు

చెరువుల మరమ్మతులు చేసే సందర్భాల్లో అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డును అధికారులు ఏర్పాటు చేయించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ బావుల దగ్గర సంబంధిత యజమానులు కంచె ఏర్పాటు చేయాలి.

చెరువులు, ఇతర జలాశయాల్లో అడుగున బురద పేరుకుపోయి ఉంటుంది. లోతు తెలుసుకోకుండా ఈత వచ్చినా అందులో దూకితే ప్రమాదం తప్పదు.

ఇవిగో ఉదాహరణలు

ఈ నెల 7న యాలాల్ మండలం హాజీపూర్‌లో ప్రమాదవశాత్తు బావిలో పడి ఈత రాక ఎర్ర హన్మంతు (34) మృతి.

ఇటీవల పెద్దేముల్ మండలం శివారులోని సుద్దగుంతలో పడి వ్యక్తి చనిపోయాడు.

ఈ నెల 6న యాలాల్ మండలం దౌలాపూర్‌లో నీటి సంపులో పడి పదేళ్ల బాలుని మృతి.

2023 లో మన్నెగూడకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు యువకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకు విహరించడానికి వెళ్లి ఈత రాక నీట మునికి మృత్యువాత పడ్డారు.

రక్షణలేని పాలేపల్లి తూము

దోమ: దోమ మండలం పాలేపల్లి ఊరచెరువు నిండితే చూడ్డానికి పిల్లలు, మహిళలు వస్తారు. చెరువు కట్ట నిటారుగా ఉంటుంది. చూసే క్రమంలో కాలు జరితే నీటిలోకి పడిపోతారు. రక్షణలేక గతంలో గ్రామానికి చెందిన పాష, రాములుగౌడ్, చంద్రయ్య, లక్ష్మి మృతిచెందారు. కంచె ఏర్పాటు చేస్తే సమస్య ఉండదు.

పిల్లలు, యువకులపై కన్నేసి ఉంచాలి

చెరువులు, కుంటలు, బావుల లోతు తెలియక, ఈత రాక మృత్యువాత పడ్డ పిల్లల సంఘటనలు జిల్లాలో అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. అందుకే పిల్లలు, యువతపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎవరితో ఆటలాడుకుంటున్నారు, ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని గమనించాలి. నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి.

# ఆక్రమణలో వరద కాలువ స్థలాలు

మెట్‌పల్లి: జలవనరుల శాఖకు చెందిన విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వరద కాలువ అవసరాల కోసం సేకరించిన మిగులు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోతుండడంతో యథేచ్ఛగా వరద కాలువ స్థలాల ఆక్రమణలు, నిర్మాణాలు చేపడుతున్నారు. జగిత్యాల జిల్లాలో వరద కాలువ ఇబ్రహీంపట్నం మండలంలో 28వ కి.మీ నుంచి ప్రారంభమై మల్యాల మండలం లో 86వ కి.మీ వద్ద ముగుస్తోంది. సుమారు 58 కి.మీ పొడవున వరద కాలువ ఉంది. కాలువ నిర్మాణంతో పాటు తవ్విన మట్టి నిల్వకు అనుగుణంగా భూసేకరణ చేశారు. కాలువ నిర్మించడంతో పాటు ఇరువైపులా రహదారి, కాల్వ కోతకు గురి కాకుండా పటిష్ఠత కోసం మట్టిని పోశారు. ప్రధాన కాలువ మధ్యలో నుంచి ఇరువైపులా 70-100 మీటర్ల చొప్పున భూసేకరణ చేశారు. సరైన పర్యవేక్షణ, హద్దురాళ్లు లేకపోవడంతో వరద కాలువ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు సమీపంలో ఉన్న చోట మట్టి తరలించి చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మట్టి తొలగించడంతో పలు చోట్ల వరద నీటికి కట్ట బలహీనపడి కోతకు గురై ప్రమాదకరంగా మారుతోంది.పక్కా నిర్మాణాలు.. పంటలు వరద కాలువ పటిష్ఠత కోసం పోసిన మట్టిని కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాలువ మట్టిని అక్రమార్కులు తరలించడంతో ఖాళీ స్థలాలు ఏర్పడుతున్నాయి. దీంతో సమీపంలోని రైతులు స్థలాన్ని తమ భూమిలో కలిపేసుకొని చదును చేయడంతో పాటు దుక్కి దున్ని పంటల సాగు చేపడుతున్నారు. అంతే కాకుండా పలు చోట్ల పక్కా నిర్మాణాలు కూడా చేపట్టారు. ఆలయాలు, ప్రభుత్వ భవనాలు, ఫంక్షన్ హాళ్లు, కంపోస్టు షెడ్లు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు ఇలా పలు రకాలుగా వినియోగించుకుంటున్నారు. జలవనరుల శాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అవసరాల కోసం వినియోగిస్తున్నందున చూసీచూడనట్లు వ్యవహరించాలని సూచిస్తుండడంతో ఏమీ చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వరద కాలువ స్థలాలను ఆక్రమించడం పరిపాటైంది.

నోటీసులు ఇస్తున్నాం

వరద కాలువ స్థలాలను ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తున్నాము. పక్కా నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశిస్తున్నాము. చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాము.

- వెంకటేశ్వర్లు, ఈఈ, మెట్‌పల్లి జలవనరుల శాఖ

# ఇంధన పోటీలు..!

నల్గొండ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇంధన వనరులపై ఆసక్తి పెంచేలా చేయడం, వాటి పరిరక్షణపై అవగాహన లక్ష్యంగా రెడ్కో సంస్థ చిత్ర లేఖన పోటీలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయివరకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థుల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

అక్టోబరు 20 లోగా దరఖాస్తులు..

ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబరు 20వ తేదీ నాటికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. 'ఎ', 'బి', గ్రూపులుగా పోటీలుంటాయి. 'ఎ' గ్రూపులో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, 'బి' గ్రూపులో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉంటారు. ప్రతి విద్యార్థి తమ పెయింటింగ్స్ ఎ-4 పేపర్‌లోనే వేయాల్సి ఉంటుంది. అక్టోబరు చివరి వారంలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయి.

టీఎస్ రెడ్కో ఆధ్వర్యంలో నవంబరు 14న రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో విజేతకు రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.2 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. డిసెంబరు 14న ఇంధన వనరుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. మొదటి మూడు బహుమతుల కింద వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు అందజేస్తారు. ల్యాప్‌టాప్ ఇస్తారు. టాప్ టెన్ వరకు నిలిచిన వారి వరకు రూ.15 వేల నగదు, ప్రశంసాపత్రం, ట్యాబ్‌లను అందిస్తారు. పోటీలు ఇంధన శక్తిని పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడటం.. శక్తి సంరక్షణే పర్యావరణ సంరక్షణపై నిర్వహిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం..

చిత్రలేఖనంలో రాణించే విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ఇంధనం శక్తి పర్యావరణానికి సంబంధించి పెయింటింగ్స్ వేసి జాతీయ స్థాయి వరకు వెళ్లొచ్చు. విజేతలకు మంచి బహుమతులున్నాయి. పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. చిత్రలేఖన పోటీల విషయమై ఇప్పటికే కలెక్టర్లు, డీఈవోలకు లేఖలు పంపాం. పాండు రంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్

# ఏరు పారినా.. నీరుండదు..!

నల్గొండ : ఎంత వర్షం కురిసినా.. వాగులు, వంకలు పారినా ఇక్కడి చెరువులు నిండవు.. ఈ ప్రాంత కరవు తీరదు. ఎందుకీ దుర్భిక్షం.. ఎక్కడుందీ నిర్లక్ష్యం.. సాగునీటి వనరులు లేక పూర్తిగా వర్షాధారంపైనే పంటలు పండించే నాంపల్లి మండల రైతులకు వాన నీటిని ఒడిసి పట్టే వనరులు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. వానాకాలంలో అడపాదడపా కురిసే వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని ఆశించే అన్నదాతలకు ఏటా నిరాశే మిగులుతోంది. అత్యంత విలువైన వర్షపు నీరు చెరువుల్లోకి మళ్లించే పరిస్థితులు లేకపోవడంతో వాగు పాలవుతోంది. ఇటీవల భారీ వర్షాలు పడినా ప్రధాన చెరువుల్లో నీరు చేరలేదు. బోర్లు అప్పుడే ఆగి పోస్తున్నాయి. నాంపల్లి, పెద్దాపురం చెరువులు 2013 నుంచి ఇప్పటివరకు అలుగు పోయలేదంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

పదిహేనేళ్ల క్రితం ఫీడర్ ఛానల్ పునరుద్ధరణకు అప్పటి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. రూ.90 లక్షలతో నెమిళ్లగూడెం వద్ద శేషిలేటి వాగుపై ఫీడర్ ఛానల్ ఏర్పాటుకు చెక్ డ్యాం నిర్మించి, రూ.10 లక్షలతో ఫీడర్ ఛానల్ కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. కానీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. ఏటా శేషిలేటి వాగు పొంగి ప్రవహిస్తున్నా చెరువులకు చుక్క నీరు చేరడంలేదు. ఇటీవల రాష్ట్రమంతటా భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని శేషిలేటి వాగూ పొంగి ప్రవహించినప్పటికీ చెరువులు జలకళకు నోచుకోలేదు. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే నాంపల్లి, పెద్దాపురం చెరువులు జలకళ సంతరించుకోవడంతోపాటు సుమారు 700 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. భూగర్భ జలాలు పెరిగి మండలంలో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

చెరువులకు చేరని వాన నీరు.. నాంపల్లి మండలంలో ప్రధానంగా శేషిలేటి వాగు, పులుసు వాగులున్నాయి. చింతపల్లి మండలం నుంచి ప్రవహించే పులుసువాగు మండలంలోని పస్నూరు పెద్ద చెరువులో కలుస్తుంది. శేషిలేటివాగు మర్రిగూడ మండలం నుంచి ప్రారంభమై మండలంలోని దామెర, నెమిళ్లగూడెం, రాందాస్‌తండా, చామలపల్లి, గానుగుపల్లి గ్రామాల ద్వారా ప్రవహించి గుర్రంపోడు మండలంలోని చేపూరు చెరువులో కలుస్తుంది. స్థానికంగా కురియకున్నా.. పై మండలాల్లో కురిసిన వర్షాలకు ఏటా ఈ వాగుల్లో నీరు ప్రవహిస్తోంది. పులుసు వాగు ద్వారా పస్నూరు పెద్దచెరువుకు ఏటా కొద్దోగొప్పో నీరొచ్చి చేరుతోంది. ఇక నాంపల్లి నాగుల, పెద్దాపురం పెద్ద చెరువులను నింపేందుకు నిజాం కాలంలోనే ఫీడర్ ఛానల్ నిర్మించారు. దీని కాలువ భూములను ఆక్రమించి చదును చేసి సాగుకు అనుకూలంగా మలుచుకోవడంతో దశాబ్ధాలుగా ఈ చెరువులకు నీరు చేరడంలేదు.

# డైరెక్టర్ల స్థానాలు దక్కేదెవరికో..!

భువనగిరి : నల్గొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 13న జరగనుంది. ఖాళీగా ఉన్న ఆరు స్థానాలకు పోటీ తీవ్రంగా ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి నాలుగు, రంగారెడ్డి జిల్లా నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా నుంచి ఒగ్గు భిక్షపతి, కల్లెపల్లి శ్రీశైలం, గుడపాటి మధుసూదన్‌రెడ్డి, డి.సోమిరెడ్డి, పుష్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, ఎస్.భాస్కర్, ఎం కొండల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు బరిలో ఉన్నారు. అత్యధిక స్థానాలు గెలుచుకుని డెయిరీ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్యాంపు రాజకీయాలకు తెరదీశాయి. 297 మందికి ఓటు..సంఘంలో 348 మంది సభ్యులుగా ఉండగా.. 297 మంది పాల సంఘాల సొసైటీ ఛైర్మన్లకు ఓటు హక్కు ఉంది. వీరంతా ఈ నెల 13న హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో ఆరు డైరెక్టర్ స్థానాలకు తమ ఓటు వేయనున్నారు. డెయిరీలో మొత్తం 15 స్థానాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో మూడు స్థానాలు ఖాళీ అవుతుంటాయి. ఖాళీ అయిన వాటికి ఎన్నికలు నిర్వహిస్తుంటారు. గతేడాది ఖాళీ అయిన మూడు స్థానాలకు ఎన్నికల నిర్వహించకపోవడంతో మొత్తం ఈ ఏడాదితో కలుపుకొని ఆరింటికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికైన ఒక్కో డైరెక్టర్ ఐదేళ్లు కొనసాగుతారు. ప్రస్తుత ఎన్నిక అనంతరం 14వ తేదీన ఛైర్మన్ ఎన్నిక జరగనుంది.

# పది రోజులే గడువు

సిరిసిల్ల : ప్రభుత్వం సీఎంఆర్ సేకరణలో జాప్యం వీడటం లేదు. మర ఆడించిన బియ్యం నింపేందుకు గన్నీ సంచుల కొరత, గోదాంల్లో స్థలాభావం తదితర కారణాలతో లక్ష్యం చేరుకోవడంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణ లక్ష్యం 71 శాతం చేరుకుంది. ఈ నెల 31తో గడువు ముగుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. పది రోజులే సమయం ఉండటంతో శతశాతం పూర్తి చేయడంపై సందిగ్ధం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు పౌరసరఫరాలశాఖ వివిధ కేంద్రాల ద్వారా 30.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. నాలుగు జిల్లాల పరిధిలోని మిల్లులు 20.33 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్‌గా ఇవ్వాలి. ఇప్పటి వరకు 15.05 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు.



బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చే క్రమంలో నాణ్యత పేరుతో కోత విధించడం, నిల్వ చేద్దామంటే గోదాంల్లో స్థలాభావం ఇవన్నింటికీ తోడు రవాణా ఛార్జీలు భారంగా మారుతున్నాయి.

ఖరీఫ్ సీజన్‌కు ఇంకా 29 శాతం బియ్యం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 50శాతం పైనే సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కాగా దీనికి గడువు ఉండటంతో ప్రస్తుతం మిల్లర్లు గత ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించారు.

జరిమానాజి

ప్రభుత్వానికి రెండు, మూడు సీజన్‌లుగా సీఎంఆర్ అప్పగించడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లను పౌరసరఫరాలశాఖ డిఫాల్టర్లగా గుర్తించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పది మిల్లులు ఉన్నాయి. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఒక మిల్లరు 2021-22 సంవత్సరానికి 41 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 2023 మార్చిలోగా సీఎంఆర్‌కు ఇవ్వాలి. గడువు పూర్తయినా ఇంకా 1,450 క్వింటాళ్ల సీఎంఆర్ ఇవ్వలేదు. పౌరసరఫరాలశాఖ ఆ మిల్లుకు రూ.5.56 లక్షల పెనాల్టీ విధించింది.

ఇవీ సమస్యలు...ప్రభుత్వం ధాన్యం కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేస్తున్నా మిల్లర్లు పలు సమస్యలతో సీఎంఆర్ ఇవ్వలేకపోతున్నారు.ప్రభుత్వం మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేశాకే సేకరణ లక్ష్యం నిర్ణయించాలి. దొడ్డు రకం క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలి. మిల్లింగ్ అయ్యాక సగటున 62 కిలోలు మాత్రమే వస్తుంది.

పోర్టిఫైడ్ బియ్యం కోసం మిల్లుల్లో ఎఫ్ఆర్‌కే, సార్టెక్స్ యంత్రాలు అమర్చుకున్నారు. క్వింటాల్‌కు 3 యూనిట్లు ఖర్చయ్యేది సగటున 4.5 యూనిట్లకు పెరిగింది. దీంతో మిల్లు ఎల్‌టీ కేటగిరి నుంచి హెచ్‌టీలోకి మారుతుంది. దీంతో విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి.

పాత గన్నీ సంచుల్లో బియ్యం నింపి గోదాంల్లో నిల్వ ఉంచుతున్నారు. ధాన్యం సంచులను శుభ్రం చేయకపోవడంతో అందులో క్రాప్రా పురుగులు పెరుగుతున్నాయి. దీంతో ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం తీసుకోవడం లేదు.

మిల్లర్లు ధాన్యం మర ఆడించినందుకు క్వింటా బియ్యానికి రూ.10, బియ్యాన్ని గోదాంలకు తరలించే రవాణా ఛార్జీలను ప్రభుత్వం ఆరేళ్లుగా ఇవ్వడం లేదు. గోదాంల్లో బియ్యం నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.240, క్వింటా ధాన్యానికి కిలో తరుగును ప్రభుత్వం మిల్లర్లకు ఇవ్వాల్సి ఉన్నా అయిదేళ్లుగా చెల్లించడం లేదు. గడువులోపు పూర్తిచేస్తాంజిల్లాలో బియ్యం సేకరణ లక్ష్యాలను గడువులోపు పూర్తి చేస్తాం. ప్రత్యేక అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మిల్లుల వారీగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మిల్లర్లు అన్ని సమస్యలను అధిగమించి సేకరణ లక్ష్యం శతశాతం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.- ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

# ఎందుకింత నిర్లక్ష్యం!

కరీంనగర్ : నగరంలోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వెళ్లే అనుసంధాన రహదారిపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడటంలేదు. గడువులోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పట్టనట్లుగా ఉంటున్నారు. ప్రతి రోజు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ.132.94 కోట్లు కేటాయించారు. గతేడాది అక్టోబరులో ఈ పనులను అట్టహాసంగా ప్రారంభించారు. అందులో ఒకటి కట్టరాంపూర్-కోతిరాంపూర్ అనుసంధాన రోడు రెండు కిలోమీటర్ల పొడవుకుగాను, కిలోమీటరు మేర నిర్మించారు. మిగతా సగం వదిలేశారు. పనులు చేయాలంటూ స్థానికులతోపాటు కార్పొరేటర్ ఆకుల నర్మద, నర్సయ్య మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేదు. సీసీ రోడ్డు తవ్వి వదిలేశారుఈ రోడ్డు పూర్తయితే కట్టరాంపూర్, భగత్‌నగర్, ధోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్, ముకరంపుర వెళ్లేందుకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా సులువుగా వెళ్లేందుకు వీలుంటుంది. గతంలో ఉన్న సీసీ రహదారిని పూర్తిగా తవ్వేశారు. కొత్తగా రోడ్డు వేస్తామని నల్లా పైపులు, గద్దెలు కూల్చివేశారు. ఇప్పుడు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పైపులైను శిథిలమై.. అంతర్గత కనెక్షన్ ఇవ్వకపోవడంతో శుద్ధజలం లీకవుతోంది. మురుగుకాలువలు ధ్వంసమై నీరంతా అస్తవ్యస్తంగా ప్రవహిస్తోంది. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. తాత్కాలికంగా కంకర పొడి పోసినా దుమ్ముతో ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. నిధులు విడుదల చేస్తేనే..ముఖ్యమంత్రి హామీ నిధుల కింద కట్టరాంపూర్-కోతిరాంపూర్ పనులు ప్రారంభించాం. సగం పనులు కాగానే గుత్తేదారు నిలిపివేశారు. నగరవ్యాప్తంగా రూ.70 కోట్లకు బిల్లులు రికార్డు చేయగా, రూ.62 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా పంపించాం. సగం నిధులు ఇచ్చినా పనులు కొనసాగుతాయి. నిర్మాణ సామగ్రి నిల్వ చేసుకొని సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

# డొక్కు వాహనాలకు చెల్లు



హైదరాబాద్: వాహనాల ఫిట్‌నెస్‌లో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ప్రయాణికుల ప్రాణాలకు భరోసా దక్కనుంది. గ్రేటర్‌లో ప్రజా, సరకు రవాణా వాహనాల తనిఖీలకు ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు అందుబాటులో రానున్నాయి. తాజాగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. గతంలో ప్రతిపాదనల వద్ద ఆగిన వీటికి కార్యాచరణ సిద్ధం కానుంది.

నగరం నలువైపులా..గ్రేటర్ పరిధిలో నలువైపులా నాలుగు కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో కేంద్రానికి రూ.8 కోట్ల వరకు వెచ్చించనున్నారు.

గ్రేటర్‌వ్యాప్తంగా 80 లక్షల వాహనాలున్నాయి. ఇందులో ఆటోలు, బస్సులు, మినీ బస్సులు, ట్రావెల్ బస్సులు, ఇతర రవాణా వాహనాలు ఏటా ఫిట్‌నెస్ ధ్రువీకరణ తీసుకోవాలి. అప్పుడే రోడ్లపైకి అనుమతించనున్నారు.

ప్రస్తుతం ఈ తనిఖీలు మాన్యువల్‌గా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చేస్తుండగా.. సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు వాహనాలకు ఫిట్‌నెస్ లేకున్నా సరే.. చూసీచూడనట్లు ఉంటున్నారు. తూతూమంత్రంగా తనిఖీలు చేసి ధ్రువీకరణ జారీ చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

పాఠశాలల బస్సులకు సైతం సక్రమంగా ఫిట్‌నెస్ ధ్రువీకరణ జరగడం లేదు. డొక్కు బస్సులు, వ్యాన్ల వల్ల విద్యార్థుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి.

టైర్ల నుంచి బ్రేకుల వరకు ఆటోమేటెడ్ కేంద్రాల్లో పరిశీలించనున్నారు. సికింద్రాబాద్, నాగోలు, ఉప్పల్, కొండాపూర్ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటుచేయడం ద్వారా నలువైపులా అందరికి అందుబాటులో ఉంటాయని భావిస్తున్నారు. ఆటోమొబైల్ రీసెర్చ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దనున్నారు.

ఇక నుంచి తనిఖీలిలా..

కంప్యూటర్లే వాహనాలను పూర్తిగా విశ్లేషిస్తాయి. ఇంజిన్ సామర్థ్యం, బ్రేకులు, టైర్లు కీలకమైన భాగాలతోపాటు వైపర్లు, సైడ్ మిర్రర్‌లు, షాక్ అబ్జర్వర్లు, డైనమో, బ్యాటరీ తదితర 40 అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలు ఇట్టే తెలిసిపోతాయి.

వాహనాల నుంచి వెలువడిన పొగలో కాలుష్య కారకాలను గుర్తించి పొల్యూషన్ అండ్ కంట్రోల్(పీయూసీ) ధ్రువీకరణ అర్హత ఉన్నది లేనిదీ ఆటోమేషన్‌లోనే గుర్తించి నివేదిక ఇస్తాయి.

గంటలో ఒక్కో కేంద్రంలో 25-30 వాహనాల వరకు తనిఖీలు నిర్వహించేలా తీర్చిదిద్దుతున్నారు. పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. తనిఖీలు తర్వాత వాహన ఫిట్‌నెస్‌పై కంప్యూటర్లే ఆటోమేటిక్‌గా స్కోరు అందిస్తాయి. ఇంజిన్, టైర్లు ఇతర లోపాలుంటే కొత్త విడి భాగాలను బిగించి మళ్లీ ఫిట్‌నెస్ నిర్వహించనున్నారు.

ప్రస్తుతం మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు నిర్వహించే ఫిట్‌నెస్ తనిఖీల్లో శాస్త్రీయత ఉండటం లేదు. కాలం చెల్లిన డొక్కు వాహనాలకూ ఫిట్‌నెస్ ఉన్నట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర్వాత ఇవే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాల ధ్రువీకరణతో డొక్కు వాహనాలకు ఇక కాలం చెల్లినట్లే.

# లోతులో పొరలు.. తీసేందుకు అధిక ఖర్చు



గోదావరిఖని : సింగరేణి గనుల్లోని బొగ్గు పొరలు లోతులో ఉండటంతో వాటిని వెలికి తీసేందుకు సంస్థకు అధిక వ్యయమవుతుంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. దీంతో టన్ను ఉత్పత్తికి ఉపరితల గనుల్లో రూ. 3 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. మార్కెట్‌లో టన్నుకు రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తుంది. అయితే భూగర్భ గనుల్లో ఉత్పతవుతున్న బొగ్గు ప్రతి టన్నుకు రూ.10 వేల వరకు వెచ్చించి.. మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకే విక్రయిస్తుంది.

ఇతర కంపెనీల కంటే ఎక్కువ

సహజ సిద్ధంగా ఏర్పడ్డ బొగ్గు పొరలు లోతులో ఉండటంతోనే సింగరేణి భారీగా వ్యయం వెచ్చించాల్సి వస్తుంది. దీంతో సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో.. ఇతర కంపెనీల కంటే బొగ్గు ధర ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. సింగరేణి పరిధిలో ఉన్న గనుల్లో భూగర్భ పరిస్థితుల ప్రకారం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే ఆరు టన్నుల మట్టిని ఉత్పత్తి చేయాల్సి వస్తుంది.

36 మిలియన్ టన్నులు వీటికే..ఎన్టీపీసీకి రామగుండం ప్రాంతంలోని గనులు, జెన్‌కోకు చెందిన కేటీపీఎస్‌కు కొత్తగూడెం, కేటీపీపీకి భూపాలపల్లి, బీటీపీపీకి మణుగూరు గనులు సమీపంలోనే ఉండటంతో బొగ్గు రవాణా ఛార్జీల భారం లేకుండా పోయింది. సింగరేణి ఏటా ఉత్పత్తి చేస్తున్న 70 మిలియన్ టన్నుల్లో 36 మిలియన్ టన్నుల బొగ్గు వీటికే రవాణా చేస్తోంది. మిగతా బొగ్గు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు కేంద్రాలకు రవాణా చేస్తోంది.

కలిసివస్తున్న రవాణా భారం

సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర కంపెనీల నుంచి రవాణా చేసుకోవడం వినియోగదారులకు భారంగా మారుతుంది. అక్కడి బొగ్గు ధరతోపాటు రవాణా ఛార్జీలు కలిపితే అదే స్థాయిలో ధర అవుతుండటంతో సింగరేణి నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు ఎక్కువగా ఇక్కడి బొగ్గును తీసుకుంటున్నాయి. కొన్ని విద్యుత్తు కేంద్రాలకు పిట్‌హెడ్ పరిధిలోనే గనులు ఉండటంతో రవాణా భారం లేకుండా పోతుంది.

ఇతర రాష్ట్రాల్లో పైపైనే..

తెలంగాణలో ఉన్న బొగ్గు నిక్షేపాల కంటే ఇతర రాష్ట్రాల్లోని పొరలు తక్కువ లోతులో ఉన్నాయి. ప్రధానంగా ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌లోని గనుల్లో.. కేవలం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే రెండు నుంచి మూడు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. సింగరేణిలో స్ట్రిప్పింగ్ రేషియో 6 నుంచి 8 వరకు ఉంది. ఇతర రాష్ట్రాల్లో 2.8 నుంచి 3.5 వరకు మాత్రమే ఉంది. దీనివల్ల అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది. బొగ్గు ధర తక్కువగానే ఉంటుంది.

# నిలిచిన పైవంతెన పనులు.. తీరని కష్టాలు

వేములవాడ : వర్షాకాలంలో ఏటా వరద ఉధృతితో వాహనాల రాకపోకలు నిలిచిపోతుండటంతో పైవంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది. సకాలంలో పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో వర్షాకాలంలో నక్కవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల ప్రజలు నక్కవాగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికి నక్కవాగు ప్రవహించడంతో వాగు దాటేందుకు వీలుపడదు. పైవంతెన నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం రూ. 11.55 కోట్లను మంజూరు చేసింది. ఇవీ ఇబ్బందులువంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు సకాలంలో ప్రారంభం కాలేదు. ఏడాది క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పిల్లర్ల దశలోనే ఉన్నాయి.

వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. వర్షాలకు పలుమార్లు కొట్టుకుపోయింది. దీంతో హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంతెన పూర్తికాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల హన్మాజీపేట గ్రామానికి చెందిన ఓ మహిళ అస్వస్థతకు గురికాగా 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం వాగు దాటడానికి రోడ్డు లేకపోవడంతో సిబ్బంది ఆమెను గ్రామం నుంచి



స్ట్రెచర్‌పై వాగు దాటించి ఆసుపత్రికి తీసుకెళ్లగా సకాలంలో వైద్యం అందకపోవడంతో ఆమె ప్రాణాలు విడిచింది.

ఏడాదిలో వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

త్వరితగతిన పూర్తి చేయాలివంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వర్షాకాలంలో అత్యవసర సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి సకాలంలో వెళ్లలేక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. తాత్కాలిక రహదారి కోతకు గురైంది. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.రాకేశ్, హన్మాజీపేట

వర్షాలతో ఆలస్యంవర్షాలు కురవడంతో వంతెన నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతుంది. పిల్లర్ల దశకు వంతెన పనులు చేరుకున్నాయి. దీపావళి అనంతరం తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించాం. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. శాంతయ్య, డీఈ ఆర్ అండ్ బీ

# పోషకాలు.. ఆరోగ్యానికి బాటలు

కరీంనగర్ : ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. ప్రచార మాధ్యమాలు.. వైద్య నిపుణుల సలహా మేరకు ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకుంటున్నారు. నిత్యం భుజించే పదార్థాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలతో మందులకు వెచ్చించే సగం డబ్బులతో.. అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కార్బోహైడ్రేట్లకు బదులుగా పోషకాహారంపై దృష్టి సారిస్తున్నారు. కరోనా తర్వాత అధిక మంది గింజలు తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నేడు జాతీయ గింజల దినోత్సవం సందర్భంగా వాటి వినియోగం ఉమ్మడి జిల్లాలో ఎలా పెరిగింది. వాటితో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం.

పెరిగిన వినియోగం..

కరోనా తర్వాత ఉమ్మడి జిల్లాలో గింజల వినియోగం పెరిగింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటిని తింటున్నారు. కాకపోతే ఖర్చు ఎక్కువ కావడంతో సగం మంది మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలు మాత్రం పేదోడి గింజగా పేరొందిన వేరుశనగను తింటున్నారు. 20 ఏళ్ల కిందట కరీంనగర్ టవర్ సర్కిల్‌లో గింజల దుకాణాలు ఒకటి, రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు నగరంలో చాలా ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒకప్పుడు జనాభాలో 5 శాతం మంది మాత్రమే వీటిని తినేవారు. ప్రస్తుతం 40 శాతం మంది ఏదో ఒకటి, రెండు రకాలు కొనుక్కొని వెళ్తున్నారని వ్యాపారి రమేష్ తెలిపారు.

బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజు గుప్పెడు గింజలు ఆహారంలో భాగం చేసుకోవాలి.

వాల్‌నట్స్ : మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటివి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తాయి.

జీడిపప్పు: గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఇందులో ఉంటుంది. అల్పాహారంలో భాగంగా తీసుకుంటే మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు నియంత్రణలో ఉంటాయి.

గుమ్మడిగింజలు: శరీరానికి ప్రొటీన్ మెగ్నీషియం, ట్రిప్టోఫాన్‌లు అధికంగా లభిస్తాయి.

పొద్దుతిరుగుడు విత్తనాలు: కంటిచూపు మెరుగుపరచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి.

బాదం: విటమిన్స్‌తోపాటు కొవ్వు, ప్రొటీన్ అధికంగా లభిస్తాయి. శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి.

పిస్తా పప్పులు: వీటితో శరీరానికి అధిక ప్రొటీన్ లభిస్తుంది. కంటి చూపు మెరుగుపర్చడంలో మేలు చేస్తుంది.

వేరుశనగలు(పల్లీలు): కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడతాయి.

విటమిన్లు.. ఖనిజాలు..

గింజలు బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, పొద్దుతిరుగుడు ఇలా అనేక రకాల్లో లభిస్తున్నాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు(మాంసకృత్తులు), ఫైబర్(పీచు), విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం చాలామంది అల్పాహారంలో భాగంగా వీటిని తీసుకుంటున్నారు. రాత్రిపూట తీసుకుంటే జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయి.

సాయిప్రియ, పోషకాహార నిపుణురాలు

ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యం..

బయట ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నాణ్యత, శుచి, శుభ్రత పాటించడం తగ్గిపోయింది. కరోనా తర్వాత ప్రతి రోజు ఉదయం గింజలు, ఎండుఫలాలను తీసుకుంటున్నా. ఖర్చు కంటే ఆరోగ్య ముఖ్యమని భావించి వీటిని తీసుకుంటున్నా. మధ్యాహ్నం కొద్దిగా అన్నం తింటున్నా.

రాజన్న, నీటి పారుదల శాఖ ఉద్యోగి

మా పిల్లల స్నాక్స్ బాక్స్‌లో..

మా ఇద్దరు పిల్లలు బడికి స్నాక్స్ తీసుకెళ్తుంటారు. అందులో బయటి తినుబండారాలు పెట్టను. పండ్లు పెడదామన్నా.. మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. అందుకనే బాదం, కాజులాంటివి పెట్టి పంపిస్తున్నాం. కొన్ని సార్లు బాదం, కాజు, ఎండుద్రాక్ష, కర్జూరాలతో లడ్డూగా చేసి ఇస్తున్నాం. ఒక్కోసారి పల్లిపట్టీలు చేస్తున్నా. బాదం నానబెట్టి తినిపిస్తుంటాం. రంగ అనూష, గృహిణి, కరీంనగర్

# ప్రారంభంలో ఆర్భాటం.. కొనడంలో ఆలస్యం

గంగాధర : పంట పండించడం ఒక ఎత్తు.. దానిని అమ్ముకునేందుకు అన్నదాతల పాట్లు మరో ఎత్తు. సాగు మొదలుకుని చీడపీడలు, అకాల వర్షాలతో దిగుబడులపై ప్రభావం.. ఇవన్నీ తట్టుకుని నిలబడ్డ రైతులు పంట అమ్ముకునేందుకు కేంద్రాలకు వస్తే అక్కడా ఆలస్యమవుతోంది. ప్రభుత్వం ఓ వైపు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నా... ఎక్కడా గింజ కూడా కొనడంలేదు. అక్కడికి ధాన్యం తెచ్చిన రైతులు ఎప్పుడు కొంటారా? అని ఎదురుచూస్తున్నారు. ఫలితంగా కొందరు రైతులు రైస్‌మిల్లర్లు, వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

అరకొర వసతులు.. తూకంలో కోత

అనేక కేంద్రాలకు ఇప్పటికి గన్నీ సంచుల సరఫరా జరగలేదు. కేవలం మార్కెట్ యార్డులలోని కేంద్రాల్లో మాత్రమే వసతులు ఉన్నాయి. వర్షాకాలంలో పంటను కాపాడుకునేందుకు కేంద్రాల నిర్వాహకులు తాటిపత్రిలు సమకూర్చక రైతులే కొనుగోలు చేసుకుంటున్నారు. ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు ఉన్నా.. విద్యుత్తు సదుపాయం లేక ఇబ్బంది పడుతుండగా ధాన్యం శుభ్రంగా లేదని క్వింటాలుకు అదనంగా 2 నుంచి 5 కిలోల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారు.

ఏ గ్రేడ్ క్వింటాలు ధాన్యానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 ప్రభుత్వ మద్దతు ధర అందిస్తోంది. అయితే సన్నరకం ధాన్యానికి తర్వాత అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ంది. అయితే ఇందులో 30 రకాల సన్న ధాన్యం కొనుగోలు చేయడం తో.. అందుకు సంబంధిత ఏఈవో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

అధికంగానే దిగుబడులుజిల్లాలో ఈ వానాకాలంలో దాదాపు 2.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో దొడ్డురకం 1.52 లక్షల ఎకరాల్లో, సన్నరకం 1.22 లక్షల ఎకరాల్లో చేశారు. ఈ లెక్కన దొడ్డు రకం ధాన్యం 3.18 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 2.49 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశముంది. జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ప్రారంభించారు. తక్కువ ధరకే అమ్మకంకొనుగోళ్లు దీపావళి తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉండటంతో.. అప్పటిదాకా ధాన్యం ఆరబెట్టి అమ్ముకోవడానికంటే ముందే రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పచ్చి వడ్లు క్వింటాలుకు రూ.1850కు అమ్ముకుంటున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్న వ్యాపారులు.. 70 కిలోల సంచి తూకానికి అదనంగా ధాన్యం వేస్తున్నారు.

# పక్కాగా నీటి లెక్క

హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భారీ ఎత్తున జరుగుతున్న నీటి పంపిణీ నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. లీకేజీలతోపాటు నీటి బిల్లులు చెల్లించకపోవడంతో జలమండలి పెద్దఎత్తున రెవెన్యూ నష్టాలను మూటగట్టుకుంటోంది. బిల్లుల ఎగవేత నష్టాలకుతోడు 10-15 శాతం లీకేజీలు సైతం తోడవుతున్నాయి. వీటిని అరికట్టేందుకు జలమండలి తాగునీటి ఆడిట్ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా ఈ ఆడిట్‌ను చేపట్టనున్నారు. తొలుత ప్యాకేజీ-2లోని ఉస్మాన్‌నగర్‌లో నిర్మిస్తున్న 4 మిలియన్ లీటర్లు, రెండు మిలియన్ లీటర్లు సామర్థ్యం ఉన్న జంట రిజర్వాయర్ల పరిధిలో అమలు చేయనున్నారు.

ఎలా చేస్తారంటే... ప్రస్తుతం అవుటర్ రింగ్‌రోడ్డు వరకు జలమండలి తాగునీటిని సరఫరా చేస్తోంది. దాదాపు 13 లక్షల నల్లాలకు రోజు విడిచి రోజు నీటిని అందిస్తోంది. దీనికోసం దాదాపు 9 వేల కిలోమీటర్ల తాగునీటి సరఫరా వ్యవస్థ ఉంది. నగరం చుట్టూ 225 వరకు సర్వీసు




రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నాయి.

పాత పైపులైన్ల వ్యవస్థ, అక్రమ నల్లాలు ఇతరత్రా కారణాలతో చాలా ప్రాంతాల్లో లీకేజీలు అవుతున్నాయి. కొన్నిసార్లు చాలామంది బిల్లులు చెల్లించడం లేదు. వీటిని రెవెన్యూ నష్టాలుగా జలమండలి పరిగణిస్తోంది. ఇప్పటివరకు ఆడిట్ లేకపోవడంతో నీటి వృథా ఎంతవుతుందో లెక్క తేలడం లేదు. దీన్ని కనిపెట్టేందుకు ప్రతి రిజర్వాయర్‌తోపాటు వినియోదారులకు సరఫరా చేసే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో చివరి పాయింట్ వద్ద ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

రిజర్వాయర్ నుంచి ఎంత నీళ్లు బయటకు వస్తున్నాయి. ఇంటి వరకు ఎంత నీళ్లు సరఫరా అవుతున్నాయో ఇవి లెక్కకడతాయి. ఫలితంగా లీకేజీలను ఇట్టే గుర్తించే వెసులుబాటు కలగనుంది.

లీకేజీల రూపంలో ఎక్కువ నీళ్లు వృథా అవుతున్నట్లు గురిస్తే...ఆయా ప్రాంతాల్లో లీకేజీలు అరికట్టడం లేదంటే పాత పైపులు స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేస్తారు.

## కూల్చిన ఇళ్ల వ్యర్థాల తరలింపు షురూ

హైదరాబాద్: నేలమట్టం చేసిన అక్రమ నిర్మాణాల వ్యర్థాలను తొలగించడంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులకు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, వాటికి పునరుజ్జీవం కల్పించేందుకు నడుం బిగించింది. అందులో భాగంగా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ సోమవారం నిజాంపేటలోని ఎర్రకుంట చెరువులో వ్యర్థాల తరలింపు పనులను ప్రారంభించారు. ఈ చెరువులోని మూడు భవన సముదాయాలను ఆగస్టు 14న హైడ్రా నేలమట్టం చేసింది. కొన్ని రోజులకు శిథిలాల్లోని ఇనుము, ఇతరత్రా వస్తువులను నిర్మాణదారు తీసుకెళ్లారని హైడ్రా తెలిపింది. ఎందుకూ పనికిరాని ఇటుక, సిమెంటు



వ్యర్థాలను అక్కడే వదిలేశారని వెల్లడించింది. మొదటి దశలో నాలుగు చెరువులకు పునరుజ్జీవం కల్పించాలని హైడ్రా నిర్ణయించగా, వాటిలో ఎర్రకుంట ఒకటి. మరోవైపు స్థానికులు కూడా వ్యర్థాలను తొలగించాలని హైడ్రాను కోరారు. ఈ నేపథ్యంలో నిర్మాణదారుకు నోటీసులిచ్చి.. వ్యర్థాల తరలింపునకు శ్రీకారం చుట్టామని హైడ్రా అధికారులు తెలిపారు. అందుకయ్యే ఖర్చును అక్రమ నిర్మాణాల యజమాని నుంచి వసూలు చేస్తామన్నారు. ఇదే మాదిరి.. మిగిలిన చెరువుల్లోని నిర్మాణ వ్యర్థాలను, పూడికను తొలగించి.. జలవనరులకు జీవం పోస్తామన్నారు. వ్యర్థాల తరలింపు పనులను చేపట్టడంపై ప్రగతినగర్ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## పట్టణ భూములకు పక్కాగా లెక్కలు..!

కొత్తగూడెం: పట్టణ భూములకు పక్కాగా లెక్కలుండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇప్పటివరకు సాగు భూములకు ఉండే నక్షా మాదిరిగా.. పట్టణాలకు సైతం రూపొందించేలా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 పట్టణాలకు నక్షా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. అందులో రాష్ట్రం నుంచి ఎనిమిది పట్టణాలుండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మణుగూరు పురపాలికను పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

పురపాలిక పరిధిలో కొనసాగనున్న సర్వే

అన్నారం, చిన్నరావిగూడెం, అనంతారం, మణుగూరు రెవెన్యూ గ్రామాలను కలిపి మణుగూరు పురపాలికగా ఏర్పాటు చేశారు. దీని పరిధిలో అధికారులు సర్వే జరుపుతారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, భూమి కొలతలు- దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. నక్షా పథకంలో ప్రతి ఇల్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తపరుస్తారు. అనంతరం ఇల్లు లేదా ఆస్తికి 'ప్రాపర్టీ కార్డులు' అందజేస్తారు. వచ్చే డిసెంబరు నాటికి పైలెట్ సర్వే పూర్తిచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# మహా నగరంలో కల్తీ దందా



హైదరాబాద్ : నగరం కేంద్రంగా భారీఎత్తున సాగుతున్న నకిలీ దందా ఆందోళనకు గురిచేస్తోంది. సబ్బుబిళ్ల.. కొబ్బరినూనె.. తేయాకు పొడి..లిప్‌స్టిక్ బామ్.. కావేవీ కల్తీకి అనర్హం అన్నట్లుగా మారాయి. ఒడిశా నుంచి వచ్చిన ఓ వ్యాపారి నాసిరకం తేయాకు పొడిని తెప్పించి అందులో ప్రమాదకరమైన రసాయనాలు.. కొబ్బరి పీచుతో కొత్త బ్రాండ్ టీ పొడి తయారు చేస్తూ పట్టుబడ్డాడు. కర్ణాటక నుంచి నగరానికి చేరుతున్న కాలం చెల్లిన పాలపొడిని హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద 5,280 కిలోల పాలపొడిని స్వాధీనం చేసుకున్నారు. జంతువుల కొవ్వుతో నూనెలు.. కుళ్లిపోయిన టమాటతో సాస్. అల్లం. వెల్లుల్లితో పేస్టు తయారు చేసి మార్కెట్‌కు చేరవేస్తున్న ముఠాలు వందల సంఖ్యలో ఉంటాయని అంచనా. 9 నెలల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 19 కేసుల్లో సుమారు 25 మంది నిందితులను అరెస్టు చేశారు.

పలు చోట్ల.. సికింద్రాబాద్, బేగంబజార్, షాహినాయత్‌గంజ్, సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, అంబర్‌పేట, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. ఇంటిని శుభ్రపరిచే ద్రావకాలు, దోమల నివారణ కాయిల్స్, సబ్బులు, లిప్‌స్టిక్, లిప్‌బామ్, విద్యుత్తు తీగలు, బిస్కెట్లు, చాక్లెట్లు, వంటనూనెలు, తినుబండారాలను స్థానికంగా తయారు చేసి ప్రముఖ కంపెనీల లేబుల్స్‌ను అతికించి మార్కెట్‌లో పంపుతున్నారని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఒకరు వివరించారు. కల్తీ సామగ్రిని నిర్ధారించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు, నిపుణులతో పరీక్షించేందుకు సమయం పడుతోందని తెలిపారు.

ఉదంతాలు ఇవిగో..

కాచిగూడకు చెందిన శ్యామ్‌భాటి, కమల్‌భాటి ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లతో మసాలా దినుసులు, సబ్బులు, టీపొడి, కొబ్బరినూనె వంటి 30 రకాల నిత్యావసర వస్తువులను హోల్‌సేల్, రిటైల్‌గా సరఫరా చేస్తున్నారు. పోలీసులు వీరి వద్ద రూ.2 కోట్ల విలువైన కల్తీ సరకు స్వాధీనం చేసుకున్నారు.

ఫతేనగర్‌కు చెందిన జగన్నాథ్, ప్రదాన్, శివాస్విన్ పరిదా వ్యాపారులు. వీరు సాగిస్తున్న కల్తీ టీపొడి దందా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. వీరు నిత్యం సుమారు 500 కిలోల టీపొడి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అఫ్జల్‌గంజ్‌కు చెందిన దయారామ్ చౌదరి అనే వ్యాపారి దిల్లీ, గుజరాత్ నుంచి నాసిరకం సామగ్రిని సరఫరా చేసుకొని ప్రముఖ బ్రాండ్ల పేరిట నిర్మాణ రంగ సంస్థలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతనిని అరెస్టు చేసి రూ.77 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# అడుగులు తడబడి.. మనసులు విడివడి




వికారాబాద్: నిండు నూరేళ్లు కలిసిమెలిసి ఉంటామని పచ్చని పందిరిలో, వేద మంత్రాల సాక్షిగా మంగళ సూత్రధారణతో ఒక్కటవుతున్న జంట ఆ బంధాన్ని విస్మరించి తగవులతో విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పెరుగుతున్న ఈ తరహా కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా జిల్లా కేంద్రంలో 2008లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనికి రోజుకు సగటున మూడు ఫిర్యాదులు అంటే నెలకు 90 ఫిర్యాదులు వస్తున్నాయి. కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చి కాపురాలు నిలబెట్టేందుకు జరుగుతున్న కృషిపై కథనం.

40 శాతం మద్యం కేసులే..

మద్యం పేద, ఉన్నత అనే తేడా లేకుండా కాపురాల్లో చిచ్చు రేపుతోంది. మహిళా పోలీస్‌ఠాణాకు వచ్చే 40 శాతం కేసుల్లో మద్యం కారణంగా సమస్యలు తలెత్తి విడిపోవాలని దంపతులు భావిస్తున్నారు. సాధారణ సమయాల్లో తమ భర్తలు బాగానే చూసుకుంటారని, మద్యం తాగితే అకారణంగా కొట్టడంతో పాటు పిల్లలను సైతం నానా మాటలు అంటున్నారని చాలా మంది మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు.

మరికొన్ని కారణాలు..

ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక వేరుగా జీవించాలని 20 శాతం మంది మహిళలు భావిస్తున్నారు.

భర్త లేదా భార్య ఇతరులతో మాట్లాడినా, ఉద్యోగ రీత్యా ఎక్కువ సమయం కార్యాలయంలో ఉండాల్సి వచ్చినా, దంపతుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి.జీవిత భాగస్వామి ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. ఇవిగో ఉదాహరణలు

తనకంటే తక్కువ సంపాదిస్తున్న భర్తపై చులకన భావంతో వికారాబాద్‌కు చెందిన ఓ మహిళ వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. చివరకు విడాకులు కావాలని స్వయంగా ఆమే వికారాబాద్ మహిళా పోలీస్‌ఠాణాలో ఫిర్యాదు చేసింది.

వికారాబాద్ పట్టణానికి చెందిన అతడికి భార్యపై అనుమానం కలగడంతో ఆమె చరవాణిలో కాల్ రికార్డింగ్ పెట్టాడు. కొద్ది రోజుల తరువాత ఇతరులతో ఆమె మాట్లాడిన మాటలు విన్న భర్త విడిపోవాలనుకున్నాడు. ఈ కేసు మహిళా పోలీస్‌ఠాణాకు రావడంతో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు.

ధారూర్‌కు చెందిన ఓ గృహిణి నిత్యం తాగి వచ్చి గొడవ పడుతూ, అనరాని మాటలంటున్న భర్త నుంచి న్యాయం కావాలని మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది.

మద్యం మత్తులో విచక్షణ మరిచి పిల్లలను, తనను హింసిస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని మరో మహిళ ఫిర్యాదు చేశారు.

కౌన్సెలింగ్‌తో కేసులు తగ్గుముఖంభార్యాభర్తలకు కౌన్సెలింగ్‌తో కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. సమస్య తీవ్రతను బట్టి సఖి, భరోసా కేంద్రాలకు పంపించి కుటుంబ పెద్దల తరహాలోనే కౌన్సెలింగ్ ఇప్పించి మాట్లాడుతున్నాం. దంపతులు ఇద్దరితో ముందుగా వేర్వేరుగా మాట్లాడి మొదట వారి సమస్యను తెలుసుకుంటున్నాం.రవీందర్‌రెడ్డి, ఏఎస్పీ, పర్యవేక్షణాధికారి, మహిళా పోలీస్‌ఠాణా.

# నిషేధిత జాబితాలో వందలాది లేఅవుట్లు



హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో వందలాది పంచాయతీ లేఅవుట్లు నిషేధిత జాబితాలో చేర్చడంపై తీవ్ర చర్చనీయాంశమవుతోంది. కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఈ జాబితా చక్కర్లు కొడుతోంది. దీనిపై రకరకాలుగా వదంతులు షికార్లు చేస్తుండటంతో ఆయా లేఅవుట్ల యజమానులు బెంబేలెత్తుతున్నారు. హెచ్ఎండీఏ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ జాబితాపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. హెచ్ఎండీఏ ఏర్పడకముందు గతంలో వందలాది పంచాయతీ లేఅవుట్లు వెలశాయి. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోని గుర్రంగూడ, నాదర్‌గుల్, బాలాపూర్, రాగన్నగూడ, తుర్కయాంజిల్, కమ్మగూడ, మన్నెగూడ, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్, ఆదిభట్ల, మంగల్‌పల్లి తదితర ప్రాంతాల్లో వందలాది పంచాయతీ లేఅవుట్లు వేసి విక్రయించారు. హెచ్ఎండీఏ వచ్చిన తర్వాత ఈ లేఅవుట్లలో కొన్ని క్రమబద్ధీకరించారు. ఇందులో పెద్దపెద్ద బహుళ అంతస్తుల భవనాలు వెలశాయి. ఇవన్నీ ప్రస్తుతం నగరానికి సమీపంలో ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు సైతం భారీగా ఉన్నాయి. అయితే ఇంకా కొన్ని లేఅవుట్లను క్రమబద్ధీకరించలేదు. దీంతో గతంలో చాలామంది రూ.1000 చెల్లించి అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) కోసం దరఖాస్తు చేశారు. ఇంతలోనే అకస్మాత్తుగా ఈ నిషేధిత జాబితా తెరపైకి రావడంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారు.

ఆందోళనలో యజమానులు..: ఈ పంచాయతీ లేఅవుట్లని ఏపీ రిజిస్ట్రేషన్ చట్టం 2007 నంబరు 19, సెక్షన్ 22ఎ(1)(ఈ) కింద నిషేధిత జాబితాలో పెట్టడంతో దరఖాస్తుదారులంతా హెచ్ఎండీఏ అధికారులను సంప్రదిస్తున్నారు. భూముల క్రయవిక్రయాల సమయంలో ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయరు. ప్రభుత్వ, ఇతర వివాదాలున్న వాటిని ఈ జాబితాలో సర్వే నంబర్లతో సహా చేర్చుతున్నారు. ఆయా సర్వే నంబర్లలోని ఆస్తిని ఎవరైనా రిజిస్ట్రేషన్‌కు ముందుకు వస్తే వెంటనే అధికారులు అడ్డుకోవడానికి వెసులుబాటు కల్పించారు. తాజాగా పంచాయతీ లేఅవుట్లు ఈ జాబితాలో కనిపించడంతో ఆయా భూముల యజమానులంతా బెంబేలెత్తున్నారు. ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ చేసుకోవడానికి తిరస్కరించే అవకాశముంది.

# సమస్యలతోనే సేకరణ

జగిత్యాల : జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. 2006 సంవత్సరం నుంచి 35 సీజన్లుగా ధాన్యం, మక్కల సేకరణతో రైతులకు ప్రత్యామ్నాయ విపణులున్నా శాశ్వత సదుపాయాల కల్పనను విస్మరించారు. ప్రస్తుత యాసంగిలో జిల్లాలో వరికోతలు ప్రారంభమై ధాన్యం కల్లాలకు వస్తుండగా కర్షకులకు ఇక్కట్లు కలగకుండా చర్యలు చేపట్టాల్సిఉంది.

సమస్యలు ఇవీ..జిల్లాలో ఇందిరా క్రాంతిపథం మహిళా స్వశక్తి సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సహకార సంఘాలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ చేపడుతున్నారు. కాగా తొలిసీజన్లలో ధాన్యంతో పాటుగా మక్కలను, మామిడి కాయలను కొనుగోలు చేయగా ప్రస్తుతం ధాన్యాన్ని మాత్రమే సేకరిస్తున్నారు. దీనికిగాను అన్ని వ్యవస్థల్లోనూ ధాన్యం సేకరణకు శాశ్వత సిబ్బందిని నియమించాల్సి ఉంది.

జిల్లాలో గడచిన యాసంగిలో ప్యాక్స్ ద్వారా 285, ఐకేపీ ద్వారా 133, మెప్మా ద్వారా 1 కేంద్రాన్ని ఏర్పాటుచేసి 4.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 5 వేల క్వింటాళ్లకన్నా తక్కువ కొనుగోలు చేసిన, అధికంగా ఖర్చుచూపిన దాదాపు 34 ప్యాక్స్ కేంద్రాల స్థానంలో ఐకేపీ ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల ధాన్యం సేకరణకు వచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించారనే



ఆరోపణలుండగా ముమ్ముందు ఇలా జరగకుండా చూడాలి.

మార్కెట్ యార్డుల్లోని కొన్ని సేకరణ కేంద్రాల్లోనే సిమెంటు గచ్చు అందుబాటులో ఉండగా గ్రామాల్లోని దాదాపు అన్ని కేంద్రాల్లోనూ మట్టికల్లాలు కావటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత స్థలాలున్న కేంద్రాల్లో సిమెంటు గచ్చును నిర్మించాల్సి ఉంది. గతంలో సరఫరా చేసిన టార్పాలిన్‌షీట్లు చిరిగిపోగా నూతనంగా సరఫరా చేయాలి. సేకరణ సంస్థలకు కమీషన్‌ను, రైతులకు క్వింటాలుకు రూ.5 చొప్పున హమాలీ ఛార్జీలను విడుదల చేయాలి.

తూకం, తేమ యంత్రాలు, గన్నీలు తదితర సామగ్రిని నిల్వచేసేందుకు గదులను ఏర్పాటు చేయాలి. సేకరణ సమయంలో కేంద్రాలవద్ద నీడ, మంచినీరు, విద్యుత్‌వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలి. కేంద్రాల్లో ధాన్యం, తూకంవేసిన బస్తాల రక్షణకు రక్షకులను నియమించాలి.?ఈ సీజన్‌లో తొలిసారిగా సన్నగింజ రకాలను కొనుగోలు చేయనుండగా ధాన్యం ఎంపికలో తేడా రాకుండా చూడాలి. కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యాన్ని తరుగు, తేమ పేరిట కోతల్లేకుండా చూడాలి, లారీల్లోని బస్తాలను వెంటదివెంట దింపేలా చర్యలు తీసుకోవాలి. కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను నియమించాలి, ప్రభుత్వ నిర్దేశిత ధర ప్రకారమే హమాలీ ఛార్జీలను రైతుల నుంచి తీసుకునేలా చూడాలి. రైతులనుంచి అదనపు వసూళ్లను అరికట్టాలి.డీసీఎంఎస్ కేంద్రాల్లో సంస్థ ఉద్యోగులను నియమించాలి, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటదివెంట ఆన్‌లైన్ చేయాలి. పంటను సాగుచేసిన రైతుల వివరాలు పోర్టల్‌లో లేకున్నా ఏఈవో ధ్రువీకరణతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. చిరిగిన గన్నీలు కాకుండా మంచి సంచులను, తగినన్ని సరఫరా చేయాలి.

అన్ని కేంద్రాల్లోనూ రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నందున వరుసక్రమాన్ని పాటించాలి. లారీల గుత్తేదారు తూకంవేసిన బస్తాలను వెంటదివెంట తరలించేలా చూడాలి లేదా బస్తాల తరలింపు బాధ్యతలను మిల్లర్లకే అప్పగించి వారికే రవాణా ఛార్జీలను చెల్లించటం సత్ఫలితాలనిస్తుంది.

జిల్లాలో వరిసాగు: 3.16 లక్షల ఎకరాలు
ఏర్పాటు చేయనున్న సేకరణ కేంద్రాలు: 421
సన్నరకాల సాగు: 86 వేల ఎకరాలు
సగటు దిగుబడి అంచనా: 6.50 లక్షల మెట్రిక్ టన్నులు
సన్నరకాల సేకరణ కేంద్రాలు: 65
మొత్తం కొనుగోలు అంచనా: 5 లక్షల మెట్రిక్ టన్నులు

## రహదారి నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

కొడిమ్యాల : కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతం నుంచి బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు గల ప్రధాన రహదారి గుంతల మయంగా మారడంతో గ్రామప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 1200 మీటర్ల రహదారి పూర్తిగా గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై దుమ్ము, ధూళితో దుకాణాదారులు, రోడ్డు పక్కనే ఇళ్లు ఉన్నవారు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించిన నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..అంగడిబజార్ నుంచి బస్టాండు వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలో పలువురు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చడంలో విఫలమయ్యారు. నాలుగేళ్ల కిందట ఆర్అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి మంజూరు చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలే...రోడ్డంతా గుంతలమయంగా మారడంతో బస్టాండు నుంచి అంగడిబజార్ వెళ్లాలంటే గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గుంతల కారణంగా పలువురు వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం..

ప్రధాన రహదారిపై రాకపోకలు ఎక్కువగా ఉండటంతో దుమ్ము, ధూళి చెలరేగి దుకాణాల్లోని సామగ్రిపై పేరుకుపోతోంది. అంతేగాక రోడ్డు వెంట వస్త్ర దుకాణాలు, లేడీస్ ఎంపోరియం వంటివి ఎక్కువగా ఉండటంతో దుమ్ము చేరి పాడవుతున్నాయి. నిత్యం దుమ్మును దులుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాము. శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

## చిన్న అపార్ట్‌మెంట్లకు 'షాక్'

హైదరాబాద్: నగరంలో సర్కిళ్ల వారీగా విద్యుత్తు నియంత్రికల(డీటీఆర్) లోడ్‌పై డిస్కం చేపట్టిన సర్వేలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. అపార్ట్‌మెంట్లలో 20 కిలోవాట్ కంటే అధికంగా లోడ్ ఉంటే ప్రత్యేకంగా డీటీఆర్ ఏర్పాటు చేసుకోవాలి. పలు సర్కిళ్లలో పెద్ద సంఖ్యలో చిన్న అపార్ట్‌మెంట్లు పబ్లిక్ డీటీఆర్‌ల నుంచి కనెక్షన్లు పొందాయి. తాజాగా చేపట్టిన సర్వేలో క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది, అధికారులు బిల్డర్లతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన కనెన్షన్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇప్పటి వరకు 1585 అపార్ట్‌మెంట్లకు రహదారిపై ఉండే పబ్లిక్ డీటీఆర్ నుంచి విద్యుత్తు కనెన్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. సర్వే పూర్తయితే ఆ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఇంజినీర్లు అంటున్నారు.

మణికొండలో కుప్పలుగా... మణికొండ పంచాయతీ పరిధిలో ఉ



న్నప్పుడు భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లూ పొందారు. పబ్లిక్ డీటీఆర్‌ల నుంచి అపార్ట్‌మెంట్లకు 200కు పైగా కనెన్షన్లు పొందారు. సైబర్‌సిటీ సర్కిల్‌లోనూ ఈ తరహా కనెన్షన్లు వెలుగుచూడటం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది.

ఆయా అపార్ట్‌మెంట్లకు నోటీసులు.. నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ డీటీఆర్ నుంచి విద్యుత్తు కనెక్షన్లు పొందిన అపార్ట్‌మెంట్లకు, వాణిజ్య భవనాలకు అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్, వాణిజ్య భవనాలకు సంబంధించి 20 కిలోవాట్లకు మించిన లోడ్ ఉంటే ప్రత్యేకంగా డీటీఆర్ ఏర్పాటు తప్పనిసరి అని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ 'ఈనాడు'తో అన్నారు.

## దత్తత ఉత్తమాట.. ఆక్రమణలకు వేశారు బాట

హైదరాబాద్: రాజధానిలో కొన్ని సంస్థలు చెరువుల దత్తత మాటున చేసిన అక్రమాలను హైడ్రా వెలుగులోకి తీసుకొస్తోంది. చెరువుల దత్తతలో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని అనేకమంది హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 20 రోజులుగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. పూర్తి ఆధారాలతో నివేదిక తయారుచేస్తే చర్యలకు సిద్ధమవుదామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు సూచించారు

చెరువుల పక్కనే వెంచర్లు: గత ప్రభుత్వ హయాంలో కొంతమంది బిల్డర్లకు, ఇతర సంస్థలకు నగరంలోని 23 చెరువులను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి దత్తత ఇచ్చారు. దీన్ని కొందరు వారికి అనుకూలంగా మార్చుకున్నారు. కొన్ని సంస్థలకు ఆయా చెరువు వద్దే వారి వెంచర్లు ఉండటంతో.. వాటిని ఆక్రమించి దాన్ని సెట్‌బ్యాక్‌గా చూపించి హెచ్ఎండీఏ/జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నా



యి. ఒకరిద్దరు చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసినట్లు గుర్తించారు. ఎంతమేరకు ఆక్రమణకు గురైంది..ఎవరు ఎక్కడ నిర్మాణాలు చేపట్టారన్న దానిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. సంబంధిత సంస్థలపై చర్యలతోపాటు ఆక్రమణలోని నిర్మాణాలను కూల్చివేయాలని భావిస్తున్నారు.

ఎవరా అధికారులు..?

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండా ఎలా అనుమతులిచ్చారు.. దానికి ఎవరు బాధ్యులు అన్నదానిపైనా ఆరా తీస్తున్నారు. దీనిపై కొద్ది రోజుల్లోనే చర్యలుంటాయని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. దీంతోపాటు కొందరు నాలాలను కొంతమేర ఆక్రమించి వాటిపై శ్లాబులు వేసి వాటిని తమ స్థలంగా చూపించి నిర్మాణ అనుమతులు పొందినట్లు తేల్చారు. ఇప్పుడు వాటన్నింటిపైనా అధికారులు దృష్టిపెట్టారు.

## హెచ్ఎండీఏలో ఇంటర్‌నెట్ సేవలు కట్

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)లో ఇంటర్‌నెట్ లేకపోవడంతో దాదాపు 10 నుంచి 12 గంటలపాటు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఇతర కార్యకలా పాలు బందయ్యాయి. ఈ పరిస్థితి ఏర్పడింది. తిరిగి మధ్యాహ్నం తర్వాత సేవలను అధికారులు పునరుద్ధరించారు. ప్రస్తుతం హెచ్ఎం డీఏ సిఫ్ సంస్థ నుంచి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్(ఐఎస్‌పీ) సేవలను పొందుతోంది. ఈ సంస్థ గడువు తీరడంతో కొత్త సంస్థకు ఐఎస్‌పీ సేవలు కేటాయించారు. దీంతో ఐఎస్‌పీ కనెక్షన్లలో మార్పులు చేర్పుల వల్ల ఇంటర్నెట్‌లో కొంత అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో స్టేట్ డేటా సెంటర్(ఎస్‌డీసీ)లో కూడా సర్వర్ల డౌన్ కావడంతో ఆ ప్రభావం హెచ్ఎండీ సేవలపై పడింది. హైడ్రా కూల్చివేతలు జరుగుతు ండటంతో ఒక్కసారిగా చెరువుల డేటా కన్పించకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత అధికారులు యథావిధిగా సమస్యను పరిష్కరించి సేవలను పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## వలపు వల.. ఉచ్చులో చిక్కి విలవిల



హైదరాబాద్: నగరంలో ఏటా సుమారు 400కు పైగా పోక్సో కేసులు నమోదవుతున్నాయి. 80 శాతం కేసుల్లో నిందితులు బాలికలను మాటలతో మభ్యపెట్టి లోబరచుకున్న వారే ఉంటున్నారు. ఈ ఏడాది 8 నెలల వ్యవధిలో 500కు పైగా పోక్సో కేసులు నమోదయ్యాయి. వీటిలో 279 మంది బాధితులు ప్రేమికులు, స్నేహితుల కోసం ఇల్లొదిలిన వారు కావటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. నగర పరిధిలోని 71 ఠాణాల్లో ఈ తరహా ఫిర్యాదులు సగటున రోజూ 1-2 వస్తుంటాయని సమాచారం.

ఓ ఇంటర్ విద్యార్థిని(16) ఆటోడ్రైవర్(35)తో ప్రేమలో పడింది. ఇల్లు విడిచి అతడితో వెళ్లిపోయింది. కొద్దిరోజులయ్యాక వ్యభిచార ముఠాకు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ప్రమాదం పసిగట్టిన బాధితురాలు తప్పించుకొని బయటపడింది. అతడు అప్పటికే ముగ్గురు విద్యార్థినులను మోసగించినట్టు దర్యాప్తులో తేలింది.

ఉన్నత కుటుంబం. ఒక్కతే కూతురు(15). తల్లిదండ్రులు గారాబం చేశారు. పదో తరగతి వయసులో ముగ్గురి ప్రేమలో పడి మూడుసార్లు ఇల్లొదిలి వెళ్లిపోయింది. ప్రతిసారి ఇంటికి తీసుకొచ్చి పద్ధతి మార్చుకోమంటూ బతిమాలారు. కౌన్సెలింగ్‌లోనూ ఆ బాలికను దారికెలా తేవాలో అర్థం కావట్లేదని పోలీసు అధికారి తెలిపారు.

తెలిసీ తెలియని వయసు.. మంచిచెడు విచక్షణను అర్థం చేసుకోలేని మనసు. ఆప్యాయంగా పలకరించే వారంతా ఆత్మీయులుగా భావిస్తారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని యువకులు, మధ్యవయస్కులు బాలికలను వంచిస్తున్నారు. ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్నారు. వారు తీసుకొచ్చిన నగలు, డబ్బు కాజేసిన ప్రబుద్ధులు.. తర్వాత వ్యభిచార గృహాలకు విక్రయించేందుకు బరితెగిస్తున్నారని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

మోసపోతున్న బాలికల సగటు వయసు 12-15

మోసగాళ్ల సగటు వయసు 25-35

ఎందుకిలా వెళ్తున్నారంటే..

పరిణతిలేని వయసు

కుటుంబ సభ్యులకంటే బాగా చూసుకుంటాడనే నమ్మకం

తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం

ప్రలోభాలకు గురికావటం

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లు

తాను చిన్నపిల్లని కాదని సొంత నిర్ణయాలు తీసుకోగలననే అభిప్రాయం.

హార్మోన్ల ప్రభావం, లైంగిక అంశాలపై ఆసక్తి.

దాచకుండా.. పంచుకోవటమే మార్గం

డాక్టర్ గీత, చిన్నారుల కౌన్సెలింగ్ నిపుణురాలు

వయసులో హార్మోన్ల మార్పు, ఆకర్షణ వారిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తల్లిదండ్రులు వివరించాలి. ప్రేమవలలో చిక్కి మోసపోయిన బిడ్డలను శత్రువులుగా చూడకుండా... సాధారణ జీవనం వైపు అడుగులు వేసేలా తోడ్పాటును అందించాలి.

## చర్లపల్లి స్టేషన్.. వెళ్లాలంటే పరేషాన్



హైదరాబాద్ : అత్యాధునిక హంగులతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో చర్లపల్లి రైల్వే స్టేషన్ సిద్ధమైంది. జాతికి అంకితం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ త్వరలో రానున్నారు. ఇవన్నీ బాగున్నా.. ఆ స్టేషన్‌కు చేరుకోవడమెలా అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. స్టేషన్ నిర్మాణం ప్రారంభించిప్పటినుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తూ.. ఇరువైపులా రోడ్లను 100 మీటర్ల మేర విస్తరించాలని రైల్వే విజ్ఞప్తులు చేస్తూనే ఉంది. అవేవీ నాటి పాలకులకు పట్టలేదు. కొత్త ప్రభుత్వం కూడా ఇప్పటివరకు దృష్టి సారించకపోవడంతో.. స్టేషన్ ప్రారంభనాటికి రహదారుల విస్తరణ జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంఎంటీఎస్ రెండోదశ అందుబాటులోకి వచ్చినా ప్రయాణికులు ఈ స్టేషన్‌కు చేరుకునే వెసులుబాటు కలగలేదు. సరైన రహదారులు లేకపోవడంతో సిటీ బస్సుల సేవలు కూడా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి తరుణంలో స్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందితప్పని పరిస్థితి ఏర్పడింది.

పెండింగ్‌లోనే ప్రక్రియ..

40 కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణికులు చర్లపల్లి స్టేషన్‌కి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. మహాలక్ష్మినగర్ నుంచి ఉన్న 40అడుగుల పాతరోడ్డును 80 అడుగుల మేర విస్తరించాల్సిఉంది. చర్లపల్లి టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐవోసీఎల్‌ను కలుపుతూ 100 అడుగుల మేర మరోరోడ్డు విస్తరించాలని ప్రతిపాదించారు. జీహెచ్ఎంసీ అధికారులు సర్వేలు చేశారు. మహాలక్ష్మిరోడ్డు విస్తరణకు రూ. 15కోట్ల విలువైన ఆస్తులను తొలగించాలని గుర్తించారు. ఇచ్చేందుకు కాలనీవాసులు సుముఖంగా లేకపోవడంతో విస్తరణ పెండింగ్‌లో పడింది. ఇక 100 అడుగుల రోడ్డు విస్తరణలో 80శాతం భూములను అటవీశాఖ నుంచి, 20 శాతం చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి సేకరించాల్సి ఉంది. పెట్రోలియం, గ్యాస్ సంస్థలను తరలిస్తే..చర్లపల్లి స్టేషన్ చుట్టూ ఐవోసీ, హెచ్‌పీ, బీపీసీఎల్ సంస్థల గ్యాస్, పెట్రోలియం సంస్థల గోదాములు న్నాయి. వీటిని వేరే ప్రాంతాలకు తరలించాలనే ప్రతిపాదనలున్నాయి. ఐవోసీ, బీపీసీఎల్‌ను నార్కెట్‌పల్లికి తరలించే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. మిగిలిన వాటిని తరలించే ప్రక్రియ పూర్తయితే దాదాపు 100 ఎకరాల స్థలం లభిస్తుంది. దీన్ని రైల్వేకు బదలాయిస్తే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కంటే సువిశాలమైన రైల్వే స్టేషన్ ఇక్కడ నిర్మించడానికి వెసులుబాటు ఉండేది. భూ సేకరణ జాప్యం కావడంతో రైల్వే వద్ద ఉన్న 50 ఎకరాల్లోనే చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు జరిగాయి.

## తవ్వుతూ.. తరలిస్తూ



సిరిసిల్ల : కాళేశ్వరం ప్యాకేజీలు, అదనపు టీఎంసీ పనుల్లో బయటపడ్డ బండరాళ్లు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. కాల్వలు, సొరంగాల తవ్వకాల్లో బయటపడ్డ రాళ్లను వాహనాల్లో క్రషర్‌లకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల అసంపూర్తి పనులు, మరికొన్ని చోట్ల గుత్తేదారు సంస్థలు క్యాంపులను వదిలివెళ్లడంతో నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అక్రమార్కులకు అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాకు సాగునీరందించే కాళేశ్వరం 9, 10 ప్యాకేజీలతో పాటు అదనపు టీఎంసీ పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం ప్రధాన కాల్వలు, సొరంగాలు తవ్వకాల పనులన్నీ మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అదనపు టీఎంసీ పనులపై ప్రభుత్వంలో సందిగ్ధత నెలకొనడంతో ఆరు నెలల క్రితమే గుత్తేదారు సంస్థ పనులను మధ్యలో నిలిపేసి, క్యాంపులను ఖాళీ చేసి వెళ్లిపోయింది. సొరంగాలు, కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో భారీగా రాళ్లు బయటపడ్డాయి. వీటిని చాలా వరకు జలాశయాల రివిట్‌మెంట్ కోసం గుత్తేదారులు కంకరగా మార్చారు. సీసీల నిర్మాణాలకు, సొరంగంలో గ్రౌటింగ్ పనులకు అందులో బయటపడ్డ రాళ్లనే వాడారు. మిగిలిన రాళ్లను కాల్వలు, సొరంగం సమీపంలోనే వదిలేశారు.కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో విలువైన మట్టిని కూడా అక్రమార్కులు వదలడం లేదు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌ల సమీపం నుంచి భారీ ఎత్తున తరలించారు. ఇక్కడి నుంచి మట్టిని తవ్వి సమీపంలోని గ్రామాలకు తరలిస్తున్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేందుకు స్థానికంగా ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారారు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల పనులేవీ జరగడం లేదు. నీటిపారుదల, రెవెన్యూ, గనుల శాఖల అధికారులు ఎవరూ ఇటువైపు రావడం లేదు. ఈ ప్యాకేజీల పరిధిలోని ఏఈల మొదలు ఈఈల వరకు అందరూ సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కేంద్రాల్లోని డివిజన్ కార్యాలయాలకే పరిమితమయ్యారు. ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన బండరాళ్లను గుట్టుచప్పుడు కాకుండా క్వారీలకు తరలిస్తున్నారు.

కాలువ తవ్వే సమయంలో కొన్ని చోట్ల రాతి పొరలు వచ్చాయి. వాటిని పగులగొట్టి కరకట్టల వెంట పటిష్ఠతకు కుప్పలుగా పోశారు. మిగిలిన వాటిని ఎక్కడికక్కడే వదిలేశారు. ఇప్పుడు వాటిపై క్రషర్ యజమానుల కన్ను పడింది. వీటిని అనువైన సమయంలో క్రషర్లకు తీసుకెళ్లి కంకరగా మార్చుతున్నారు. కంకర విక్రయాల్లో జిల్లాలోని క్రషర్ యజమానులంతా సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయిస్తున్నారు. వీటిని అడ్డుకునేవారు లేకుండా పోయారు.

వేలం ద్వారా విక్రయించాలి

ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన గ్రావెల్, బండలను గుత్తేదారులు ఆయా ప్రాజెక్టుల్లో అంతర్గత పనులకు వినియోగించుకోవచ్చు. మిగిలిన వాటికి సంబంధించి నీటిపారుదలశాఖ మాకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడి నిల్వల ప్రకారం వేలం ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. - క్రాంతికుమార్, సహాయ సంచాలకుడు, గనులశాఖ

## మన జాగాలో వద్దు.. రోడ్డు మీద పెట్టు

హైదరాబాద్: నగరంలో గృహ, అపార్ట్‌మెంట్ల యజమానులు, నిర్మాణదారులు కొందరు సెట్‌బ్యాక్ లేకుండా నాలుగైదు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. జాగా లేక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏకంగా రహదారులను ఆక్రమిస్తున్నారు. సెట్‌బ్యాక్ లేకుండా భారీ నిర్మాణాలు కడుతుంటే అడ్డుకోవాల్సిన పురపాలక శాఖ చోద్యం చూస్తోంది. వారికి లేని అభ్యంతరాలు తమకెందుకు అన్నట్లుగా విద్యుత్తు అధికారులు పరిశీలించకుండానే కరెంట్ కనెక్షన్ ఇస్తున్నారు.

కాలనీ దారిలో.. మైలార్‌దేవ్‌పల్లి ఠాణా ఎదురుగా ఒక వాణిజ్య భవనం నిర్మించారు. దీనికి సంబంధించిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఇతర వ్యవస్థలన్నీ వారి ప్రాంగణంలోనే ఉండాలి. కానీ ప్రాంగణం బయట వీటిని ఏర్పాటు చేశారు. 3 అడుగుల మేర రోడ్డు ఆక్రమించడంతో దారి కుంచించుకుపోయింది.

గృహ నిర్మాణాల్లోనూ...ఐటీ కారిడార్ మాదాపూర్ అయ్యప్పసొసైటీ చుట్టుపక్కల కాలనీల్లో ఇరుకు రహదారులు. ఇక్కడ తక్కువ విస్తీర్ణంలో



ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్ కట్టడం, వాటికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను రహదారులపై ఏర్పాటు చేస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నా ఇక్కడ ఈ దందా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ చూసి శివార్లలోనూ చేస్తున్నారు. పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ అయితే ఎక్కువ విస్తీర్ణం అవసరం ఉంటుందని.. కొందరు బిల్డర్లు తక్కువ సామర్థ్యం కల్గిన రెండు డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

జనరేటర్లతో ఆక్రమణ..

ప్రముఖులు నివాసం ఉండే జూబ్లీహిల్స్ రోడ్‌నంబరు 60, ఇతర రహదారుల్లో కొందరు పెద్దలు ఏకంగా పాదబాటలపై జనరేటర్లను ఏర్పాటు చేశారు. బయటికి కనిపించకుండా చుట్టూ ఫెన్సింగ్ వేశారు. 500 నుంచి వెయ్యి గజాల స్థలాల్లో ఉన్నప్పటికీ కొందరు యథేచ్ఛగా పాదబాటలపై డీజీసెట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడికి సమీపంలోని మరో కాలనీలో తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు ఉన్నవారు.. కార్ల పార్కింగ్ కోసం పాదబాటలను ఆక్రమించి షెడ్లు వేసుకున్నారు. ఈ తరహాలో చాలా కాలనీల్లో రహదారులపై షెడ్లు వేశారు.

## లాభాల వాటా.. అభివృద్ధికి బాట

రామగుండం : యూరియా ఉత్పత్తి ప్రారంభమైన మొదటి సంవత్సరంలో నష్టాల్లో కూరుకుపోయిన రామగుండం ఎరువుల కర్మాగారం ఆ తర్వాత వరుసగా మూడేళ్లుగా లాభాల బాటలో వెళుతుంది. దీంతో సామాజిక అభివృద్ధి నిధుల విడుదలకు మార్గం సుగమం కానుంది. ఫెర్టిలైజర్ సిటీ నుంచి లక్ష్మీపురం మీదుగా వీర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు గౌతమినగర్ నుంచి ఎన్టీపీసీ కూడలి వరకు కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటుకు గత సంవత్సరమే స్థానిక యాజమాన్యం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆమోదం కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం అయినా అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందేమో చూడాలి.

ప్రభావిత ప్రాంతాల సమస్యలు

రామగుండం ఎరువుల కర్మాగారం ఏర్పాటుతో పక్కనే ఉన్న లక్ష్మీపురం, గుంటూరుపల్లి, వీర్లపల్లి, విఠల్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కర్మాగారం నుంచి వెలువడే భారీ శబ్దాలతో పాటు దుర్వాసనతో వీర్లపల్లి వాసులు ఆందోళన చెందుతున్నారు. కర్మాగారం ప్రహరీ పక్కనుంచి వీర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు నిర్మిస్తే కేవలం వీర్లపల్లి వాసులకే కాకుండా గోదావరిఖని పరిసర ప్రాంతాల నుంచి యైటింక్లయిన్, పోతన కాలనీలు, కమాన్‌పూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజల ఇక్కట్లు తప్పనున్నాయి. వర్షాకాలంలో కర్మాగారం బూడిద చెరువు నుంచి వచ్చే వరద నీరుతో శాంతినగర్, సంజయ్‌గాంధీనగర్ ప్రాంతాల్లోని ఇళ్లు జలమయమౌతున్నాయి. గతంలో బూడిద చెరువు తెగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. కర్మాగారం ఏర్పాటునకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం ఫెర్టిలైజర్ సిటీ నుంచి ఎన్టీపీసీ కూడలి వరకు రహదారి, కేంద్రీకృత విద్యుత్తు దీపాలు, విభాగినిల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ నిధులతో కర్మాగారం, ఫెర్టిలైజర్ సిటీలో అంతర్గత రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయగా మిగిలిన కొద్దిపాటి నిధులతో గౌతమినగర్-ప్రగతినగర్ వరకు రోడ్డు నిర్మించి వదిలేశారు. కర్మాగారం ప్రారంభోత్సవానికి ప్రధాని వచ్చినప్పుడు నగరపాలిక నిధులతో మిగతా రోడ్డు పూర్తిచేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి నగరపాలిక కేటాయించిన నిధులను ఎరువుల కర్మాగారం తిరిగి చెల్లించాలనే షరతు ఉంది. రోడ్డుపై విభాగినిలతో పాటు కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటునకు చర్యలు తీసుకోవాలి. లక్ష్మీపురంలోని పట్టణ పీహెచ్‌సీలో సదుపాయాల కొరత ఉంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటే ప్రభావిత ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

లాభాల పరంపర ఇలా

సాంకేతిక అవరోధాలు, వివిధ కారణాలతో యూరియా ఉత్పత్తి ప్రారంభమైన మొదటి సంవత్సరంలో రామగుండం ఎరువుల కర్మాగారం ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయింది. ఎలాగోలా రెండో సంవత్సరం(2022-23)లో రూ.8 కోట్లు, మూడో సంవత్సరం (2023-24)లో రూ.445 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో సుమారుగా రూ.150 కోట్ల లాభాన్ని అర్జించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఆశించిన దానికంటే ఎక్కువే లాభాలు వచ్చే అవకాశముంది. వరుసగా మూడేళ్లు లాభాలు వచ్చిన నేపథ్యంలో నిబంధనల ప్రకారంగా సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించాలి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి సామాజిక నిధులు విడుదలయ్యే అవకాశముంది. రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి కనీసం రూ.10 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యే అవకాశముండటంతో ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మార్గం సుగమం అవుతోంది.

# మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

అమరావతి: అమరావతికి రైల్వేలైన్ మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వినీ వైష్ణవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ భాజపా అధ్యక్షురాలు పురంధేశ్వరి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం కానుందన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ సహా ఇతర అంశాల్లో రాష్ట్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చరిత్రాత్మక రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజధాని నుంచి ఏ ప్రాంతానికైనా అనుసంధానం చాలా కీలకమన్నారు. పది రోజుల స్వల్ప వ్యవధిలోనే కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు కేబినెట్ ముందుకు తెచ్చారని చెప్పారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల మారనుందని కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ వస్తుందని వెల్లడించారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. “160 కి.మీ వేగంతో వెళ్లేలా సెమీ హైస్పీడ్ రైల్వేలైన్ల నిర్మాణం. మొత్తం మూడు కారిడార్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. అమరావతి–హైదరాబాద్, అమరావతి– చెన్నై కారిడార్ల అభివృద్ధి. అమరావతి బెంగళూరు కారిడార్ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. రైల్వే లైన్ ద్వారా అమరావతికి ప్రత్యక్ష అనుసంధానం ఉంటుంది. పరిశ్రమల స్థాపన, ప్రజా రవాణాకు మెరుగైన వ్యవస్థలా ఉంటుంది.



బహుళ ట్రాకింగ్ సులభతరంతో పాటు రద్దీని తగ్గిస్తుంది” అని కేంద్ర మంత్రి వివరించారు. అమరావతికి 57 కి.మీ.ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. రూ.?2,245 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజధాని అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

**రహదారుల అభివృద్ధికి రూ.252.42 కోట్లు మంజూరు :** రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరువరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ‘ఎక్స్’లో పోస్టు చేశారు.



# ‘ఐరాసలో సంస్కరణలు తక్షణ అవసరం’ - బ్రిక్స్ వేదికగా జైశంకర్ ఉద్ఘాటన

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరం ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. మరింత సమానమైన ప్రపంచ క్రమాన్ని సృష్టించేందుకు అంతర్జాతీయ అత్యున్నత సంస్థల్లో సంస్కరణలు తక్షణ అవసరమని ఉద్ఘాటించారు. రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు రోజున ప్రసంగించిన ఆయన .. ప్రపంచ క్రమం రూపాంతరం చెందుతున్న తీరుకు బ్రిక్స్ ఓ ఉదాహరణ అన్నారు. “ప్రపంచక్రమం ఎంత తీవ్రంగా రూపాంతరం చెందుతుందో బ్రిక్స్ తెలియజేస్తుంది. ఇదే సమయంలో గతంలోని అనేక అసమానతలు కూడా కొనసాగుతున్నాయి. వాస్తవానికి, కొత్త రూపాలను, గుణాలను ఆయా దేశాలు స్వీకరించాయి. అభివృద్ధి వనరులు, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడాన్ని మనం చూడవచ్చు. ప్రపంచీకరణ ప్రయోజనాలు అసమానంగా ఉన్న విషయాన్ని గుర్తించాలి” అని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి, అనేక సంక్షోభాలు గ్లోబల్ సౌత్‌పై మరింత భారం మోపాయన్న ఆయన.. ఆరోగ్యం, ఆహారం, ఇంధన భద్రతకు సంబంధించిన ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను గుర్తించడంలో ప్రపంచం గణనీయంగా వెనకబడిపోయే ప్రమాదం ఉందని ఎస్ జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు.

సమానమైన ప్రపంచ క్రమాన్ని సృష్టించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచించిన ఆయన.. అత్యున్నత సంస్థల యంత్రాంగాలను సంస్కరించాలన్నారు. ప్రత్యేకంగా ఐరాస భద్రతా మండలిలోని శాశ్వత, తాత్కాలిక విభాగాల్లో తక్షణ సంస్కరణలు అవసరమని బ్రిక్స్ వేదికగా ఉద్ఘాటించారు.

# రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారులు: సీఎం చంద్రబాబు

అమరావతి: రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని, 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని, 75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 95 ప్రాజెక్టులకు వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు–కడప–విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 15 రోజుల్లో పర్యావరణ అనుమతులు సాధించాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు రూ.18 వేల కోట్లతో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగనుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుందని తెలిపారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

**ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది..** “ఆస్తిలో వాటా ఇవ్వనంటూ తల్లి, చెల్లిని జగన్ రోడ్డుపైకి లాగారు. మమ్మల్ని నిందిస్తూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. జగన్ లాంటి వ్యక్తులతో రాజకీయాలు చేస్తాననుకోలేదు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటే జగన్‌ను విమర్శించకూడదని షరతు పెట్టారు. ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది. వైకాపాలో ఉన్నామని చెప్పుకొనేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గుపడుతున్నారు. జగన్ ప్రభుత్వం దాచిపెట్టిన చీకటి జీవోలపై విచారణ జరిపిస్తాం. చీకటి జీవోల్లోని అక్రమాలు నిగ్గుతేల్చి గత తప్పిదాలు సరిదిద్దుతాం” అని సీఎం తెలిపారు.

# ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనురాధ

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్ పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారిణి ఎ.ఆర్. అనురాధ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలోని ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్.. ఆమెతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు.



ఎ.ఆర్.అనురాధకు బోర్డు సభ్యులు, కార్యదర్శి, సహ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నియామకాలపై బోర్డు సభ్యులు, అధికారులతో ఛైర్ పర్సన్ సమీక్షించారు. గ్రూప్ 1, గ్రూప్ 2 సహా నిర్వహించాల్సిన పలు నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలపై ఆరాతీశారు. పలు ఉద్యోగాల భర్తీ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనలు, కొత్తగా నోటిఫికేషన్లు, ఇవ్వాల్సిన ఉద్యోగాల గురించి ప్రాథమికంగా చర్చించారు. వీటిపై వీలైనంత త్వరగా కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.



# జనసేన పార్టీలోకి విడదల రజిని?

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైయస్ఆర్సీపీకి దారుణమైన ఎదుగుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎవరు ఊహించలేని విధంగా ఓటమిపాలైంది. కేవలం 11 ఎమ్మెల్యే సీట్లకు మాత్రమే పరిమితమైంది. ఈ ఘోరమైన ఓటమిని చవిచూసిన తర్వాత వైఎస్ఆర్సిపి వరుసగా సమీక్షలు నిర్వహిస్తోంది. అయితే ఆ పార్టీకి ఎప్పుడు వరుసగా ఏదో ఒక తలనొప్పులు ఎదురవుతూనే ఉన్నాయి. కొందరు నేతలు పార్టీని వీడుతున్నారు.

ఇప్పటికే మాజీ మంత్రులు రావెల కిషోర్ బాబు, శిద్దా రాఘరావులు పార్టీకి వీడ్కోలు పలికారు. తాజాగా మరో మాజీ మంత్రి పార్టీని వీడుతున్నట్లు సోషల్ మీడియాలో అనేక రకాలు గా ప్రచారాలు జరుగుతున్నాయి. ఆ మంత్రి మరెవరో కాదు విడదల రజిని. ఈ విషయం తెలిసి వైఎస్ఆర్సిపి పార్టీ నేతలు షాక్ లో మునిగిపోయా రు. విడదల రజిని పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు అనేక రకాల వార్తలు వస్తున్నాయి. జాతీయ పార్టీ నేతలతో విడదల రజిని చర్చలు జరిపినట్లు కొందరు ప్రచారాలు చేస్తున్నారు. అంతేకాకుండా ఆమె ఫోన్ లో కూడా టచ్ లో లేదని అంటున్నారు. అధిష్టాన పెద్దలకు అస్సలు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు. అయితే ఇదంతా సోషల్ మీడియాలో ప్రచారం మాత్రమేనని వైఎస్సార్సీపీ వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా కొందరు కావాలని ఉద్దేశపూర్వకంగా ప్రచారాలు చేస్తున్నారంటున్నారు.

ఇక ఇటు విడుదల రజిని వైయస్ఆర్సీపీ పార్టీని వీడి జనసేన పార్టీలోకి మారబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం జనసేన పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో వారితో చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ వార్త నిజమా కాదా అనేది తెలియాల్సి ఉంది.

# తనకు తానే ప్రతిపక్ష హోదా ఇచ్చుకున్న జగన్..




విజయనగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గురువారం విజయనగరం జిల్లా గుర్లలో పర్యటించారు. డయేరియా బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతుండగా ప్రజల్లో గందరగోళం చెలరేగింది. దీంతో జగన్ ఎంత సర్ది చెప్పినా వారు వినకపోవడంతో ప్రజలపై అసహనం వ్యక్తం చేశారు. ప్రెస్‌మీట్‌లో మీడియాతో మాట్లాడాలా.. వద్దా... అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, పోలీసులపై మండిపడ్డారు. తనకు తానే ప్రతిపక్ష హోదా ఇచ్చుకున్న జగన్.. లేని ప్రతిపక్ష నేత హోదాను ఉన్నట్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జగన్ తీరుపై స్థానికులు మండిపడ్డారు. ఓ దశలో మీడియాతో మాట్లాడకుండా వెనుదిరిగారు. అయితే స్థానిక వైసీపీ నేతలు సర్ది చెప్పడంతో జగన్ మళ్లీ మీడియాతో మాట్లాడారు. గతంలో వైసీపీ హయాంలో గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చి గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చదిద్దామని.. ఈ రోజున పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు ఒకసారి గమనించాలని జగన్ అన్నారు. ఆ రోజు ఏ గ్రామానికి వెళ్లినా సచివాలయాలు కనిపించేవని, వివిధ శాఖలకు సంబంధించి పనులు చేయించామన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ స్వరాజ్యం కనిపించేదన్నారు. గుర్ల గ్రామంలో డయేరితో 14 మంది చనిపోయారన్న వాస్తవాన్ని కూడా ఈ ప్రభుత్వం అంగీకరించలేని పరిస్థితిలో ఉందని, కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని జగన్ విమర్శించారు. తన తల్లి, చెల్లి ఫోటోలు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రతి ఇంట్లో కుటుంబ కలహాలు ఉంటాయని జగన్ అన్నారు. గ్రామ స్వరాజ్యం ఎంత పతనమైందో గుర్లను చూస్తే అర్థమవుతుందని, మృతుల సంఖ్యను కూడా దాచిపెడుతున్నారని ఆరోపించారు. గుర్ల మండలంలో డయేరియాతో మొత్తం 14 మంది మృతి చెందారన్నారు.

ఒక్కొక్క కుటుంబానికి వైసీపీ తరఫున రెండు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవటానికి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నం చేస్తున్నారని జగన్ ఆరోపించారు.

# అమరావతికి రైల్వే లైన్‌పై డిప్యూటీ సీఎం పవన్ ఏమన్నారంటే

అమరావతి: అమరావతి రైల్వే అనుసంధాన ప్రాజక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. కొత్త రైల్వే లైన్ అమరావతికి బిగ్ బూస్ట్ అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని నగరాలను కలిపే ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యమైన ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏపీకి ఎంతో ఉపయోగకరమని పవన్ విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని ఇతర నగరాలను కలపడంతో పాటు హైదరాబాద్‌కు కనెక్టివిటీని పెంచుతుందని ఆయన చెప్పారు.

బందరు, కృష్ణపట్నం పోర్టులను కలిపే ఈ కొత్త రైల్వే లైన్ చాలా దూరదృష్టితో ప్రతిపాదించిన ప్రాజెక్ట్ అని ఆయన ప్రస్తావించారు.



ఈ మేరకు రైల్వే శాఖ నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ వర్చువల్‌గా మాట్లాడారు.

# జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలతో విజయమ్మ: సోమిరెడ్డి

మంగళగిరి: ఆస్తి కోసం తల్లి, చెల్లిని బ్లాక్‌మెయిల్ చేసిన జగన్‌ను మాజీ సీఎం అని పిలవాలన్నా అసహ్యం వేస్తోందని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆస్తి ఇవ్వనంటూ కోర్టుకెళ్లడం ఆయన క్రూర మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జగన్ అనుభవిస్తున్న ఆస్తి ప్రజలదని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. సరస్వతీ పవర్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు 30 ఏళ్లకు జగన్ పొడిగించుకున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ 6 ఏళ్ల వరకూ కార్యకలాపాలు ప్రారంభించకపోవడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఆ భూ కేటాయింపులను ప్రభుత్వం ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా సరస్వతి పవర్ యాజమాన్యం వ్యవహరించినందున కేటాయింపులు రద్దు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ప్రజల ఆస్తులు కూడగట్టుకున్న జాబితాలో జగన్‌ది దేశంలో 2వ స్థానమని ఆరోపించారు. కాంగ్రెస్‌తో ఆయన జరుపుతున్న మంతనాలు ఇప్పటికే బయటకు తెలిశాయన్నారు. ఏ తల్లి అయినా తన పిల్లలందరినీ సమానంగా చూసుకుంటుందని.. కానీ జగన్ క్రూరత్వం గ్రహించే షర్మిలతో విజయమ్మ ఉండాల్సి వస్తోందన్నారు. జగన్ క్రూరత్వంపై ఓ దర్శకుడు సినిమా సన్నివేశం తీశారంటూ వీడియోను సోమిరెడ్డి ప్రదర్శించారు. జగన్ ఒప్పుకుంటే సరస్వతీ పవర్ 1500 ఎకరాలను 3 భాగాలు చేసి ఒక భాగం రైతులకిచ్చి.. మిగిలిన 2 భాగాలను జగన్, షర్మిలకు సమానంగా పంచుతామన్నారు.

# ఇది చారిత్రాత్మకమైన రోజు



న్యూఢిల్లీ, అక్టోబర్ 24: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే లైన్ మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు గురువారం న్యూఢిల్లీలో స్పందించారు. ఇది చారిత్రాత్మకమైన రోజు అని ఆయన అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కల నిజమవుతున్న రోజు.. ఈ రోజు అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ముగ్గురిపై నమ్మకం పెట్టుకున్నారన్నారు. వారు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని ఆయన వివరించారు. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ గురువారం క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కనెక్టివిటీ అత్యంత కీలకమైన అంశమని ఆయన గుర్తు చేశారు. అమరావతికి రైల్వే లైన్ మంజూరు చేయడంతో.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రయాణ, రవాణా సదుపాయాల మరింత పెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను కేవలం 10 రోజుల్లోనే క్యాబినెట్ ముందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తీసుకు వచ్చారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న సంక్షోభానికి ఈ తరహా వేగవంతమైన నిర్ణయాలు చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు నిర్ణీత సమయంలోగా పూర్తవుతుందని తాము భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 15 వేల కోట్లు కేటాయించారని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కూటమికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇక ఎన్నికల ప్రచారంలో సైతం ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాజధాని అమరావతి అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. దీంతో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కూటమికి ప్రజలు మద్దతు పలికారు.

# జగన్ అక్రమ ఆస్తులపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి : మాజీ మంత్రి డొక్కా



గుంటూరు: నైతిక విలువలు లేకుండా సొంత తల్లి, చెల్లిని కోర్టు ద్వారా ఇబ్బందులు పెట్టడం చూస్తే.. వైకాపా అధినేత జగన్ చరిత్రహీనుడిగా నిలవబోతున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో, ప్రస్తుతం ఉన్న ఆస్తులు.. వాటి విలువ ఎంతో చెప్పాలని జగన్‌కు సూచించారు. జగన్ అక్రమ ఆస్తులపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరారు. జగన్ బరితెగింపు చూస్తే.. కేంద్ర ఆర్థిక సంస్థల్లో కొందరు ఆయన ద్వారా లబ్ధి పొందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రధాని మోదీ దీనిపై తక్షణమే ప్రత్యేక చర్చలు జరిపి.. చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వం కూడా ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి జగన్ ఆస్తులను జాతీయం చేయాలని కోరారు. ప్రజల ఆస్తులను అప్పనంగా దోచుకున్న జగన్మోహన్ రెడ్డి ఆస్తులపై కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు.

# ఎర్రటి చీరలో కుమారి పాప.. స్టన్నింగ్!

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి హెబ్బా పటేల్. స్టార్ హీరోయిన్ ట్యాగ్ ను దక్కించుకోకపోయినా, యూత్ లో ఆమెకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కుమారి 21 ఎఫ్ సినిమాలో తన ఆకర్షణీయమైన అభినయంతో అందరినీ ఆకట్టుకుని, కుర్రకారును ఫిదా చేసింది. ఆ సినిమా తర్వాత వరుస ఆఫర్లు వచ్చినా, బిగ్ హిట్స్ సాధించడంలో తడబడింది. అయితే ఈడో రకం ఆడో రకం, ఎక్కడికి పోతావు చిన్నవాడ, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, అందగాడు, మిస్టర్, 24 కిస్సెస్ వంటి చిత్రాల్లో తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని చూపించింది. ఇటీవల ఓదెల రైల్వే స్టేషన్ సినిమాతో మంచి హిట్ అందుకోవడంతో, ఆడియన్స్ మళ్లీ ఆమె వైపు చూస్తున్నారు. అలాగే, గీత, శాసనసభ, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినిమాలతో కూడా మంచి గుర్తింపు పొందింది.



సినిమాలతో బిజీగా గడుపుతున్నా కూడా హెబ్బా సోషల్ మీడియాలో మరింత యాక్టివ్ గా ఉంటుంది. ప్రతి రోజూ తన పర్సనల్ లైఫ్, సినిమా అప్‌డేట్స్ పిక్స్, వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా తన అందం, ఫ్యాషన్ స్టేట్మెంట్‌తో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. రకరకాల డ్రెస్సుల్లో స్టైలిష్ ఫొటోషూట్స్ చేస్తూ, ఆ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంది. తాజాగా పంచుకున్న పిక్స్ తో మరోసారి నెటిజన్లను ఆకట్టుకుంది. ఎర్రటి చీరలో తన అందాన్ని నాజూకుగా ప్రదర్శిస్తూ, డీసెంట్ గా కనిపిస్తూ మైమరిపించింది. ఈ పిక్స్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో అభిమానులు లైకులు కొడుతూ కామెంట్స్ పెడుతున్నారు. హెబ్బా ఇలాంటి పిక్ షేర్ చేసినప్పుడల్లా నెటిజన్లు, అభిమానులు తెగ హుషారుగా స్పందిస్తుంటారు. ఇలా సోషల్ మీడియాలో హెబ్బా పటేల్ తన స్టైలిష్ అవతారాలతో ఎప్పటికప్పుడు ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది.

# లవ్ రొమాన్స్ అంటే షారూఖ్ అయి ఉండాలి: మను భాకర్

ఒలింపిక్స్ 2024లో మొదటి మెడల్ సాధించిన క్రీడాకారిణిగా మను బాకర్ రికార్డులకెక్కిన సంగతి తెలిసిందే. భారతదేశానికి గర్వించదగిన విజయాన్ని అందించింది. ఒలింపిక్ పతకం అందుకున్న తర్వాత దేశంలో తనకు ఫాలోయింగ్ పెరిగింది. అలాగే మను బ్రాండ్ వ్యాల్యూ అమాంతం పెరిగడంతో ఆదాయం గ్రాఫ్ పెరిగింది. ఇప్పుడు కౌన్ బనేగా కరోడ్‌పతి 13లో మను భాకర్ కనిపించింది. బాలీవుడ్‌పై తనకున్న అభిమానం గురించి షో హోస్ట్ అమితాబ్ బచ్చన్‌తో మాట్లాడింది. క్రీడలతో పాటు సినిమాపై తన ప్రేమను కూడా వ్యక్తం చేసింది. ప్రేమ, శృంగార రసం విషయానికి వస్తే షారుక్ ఖాన్ లా ఇంకెవరూ చేయలేరని మను ప్రశంసించారు.




ప్రేమ – రొమాన్స్ లో అది షారుఖ్ ఖాన్ అయి ఉండాలి! అని ఆమె సమాధానం ఇచ్చింది. ఆమె సమాధానంపై అమితాబ్ స్పందిస్తూ– మేడమ్, నేను నా సినిమాల్లో సరిపడినంత ప్రేమ కథలు, శృంగారం కూడా చేశాను అని పేర్కొన్నాడు. అహూతులంతా పగలబడి నవ్వుతుండగా మను .. సర్ ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో మీ పేరు లేదు కదా! అన్నారు. మొహబ్బతీన్ సినిమా నుంచి ఒక డైలాగ్ కూడా వినిపించి అమితాబ్ మనసును గెలుచుకున్నారు మను. నాగ్ అశ్విన్ డిస్టోపియన్ యాక్షన్–థ్రిల్లర్ కల్కి 2898 ADలో నటించిన అమితాబ్, 2025లో సీక్వెల్ లోను నటిస్తారని కథనాలొచ్చాయి. ఈ సైన్స్–ఫిక్షన్ చిత్రంలో ప్రభాస్, దీపికా పదుకొనే, కమల్ హాసన్, దిశా పటానీ, శోభన, శాశ్వత చటర్జీ తదితరులు నటించారు. ఈ చిత్రం హిందీలో నెట్‌ఫ్లిక్స్‌లో..ఇతర ప్రాంతీయ భాషల్లో ప్రైమ్ వీడియోలో ప్రసారం అవుతోంది. ఆర్ బాల్కీ ది ఇంటర్న్ అనుసరణలోను అమితాబ్ నటిస్తున్నారు. ఇందులో దీపికతో కలిసి నటించనున్నాడు.




# దిశా పటానీ డీప్ క్లీవేజ్ పై సెన్సార్ అభ్యంతరం!



సూర్య కథానాయకుడిగా నటించిన కంగువ సినిమా భారీ అంచనాల మధ్య నవంబర్ లో రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు పీక్స్ కి చేరాయి. సూర్య లుక్, వార్ సన్నివేశాలు ప్రతీది అంతకంతకు హైప్ తీసుకొచ్చాయి. సూర్య కెరీర్ లో తొలి పాన్ ఇండియా రిలీజ్ ఇదే. అయితే ఈ సినిమాలో హీరోయిన్ కారణంగా సెన్సార్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఓ పాటలో దిశా పటానీ ధరించిన డ్రెస్ పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది సెన్సార్ బోర్డ్. ఇటీవలే ఆ సినిమాలోని %–%యోలో యుఒన్లీ లైవ్ వన్స్%–% అనే పాటను రిలీజ్ చేసారు. ఈ పాట ట్రెండింగ్ లో నిలిచింది. సూర్య–దిశా పటానీ మధ్య కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి. నెటి జనులంతా ఫిదా అవుతున్నారు. అయితే ఈ పాటలో మూడు సెకన్ల పాటని ట్రిమ్ చేయాలని ఆదేశించింది. దిశా పటానీ ధరించిన డీప్ క్లీవేజ్ డ్రెస్ తో ఉన్న సన్నివేశాలు పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. జీన్స్ ప్యాంట్ పై బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్ బ్లౌజ్ ధరించింది. ఈ బ్లౌజులో దాదాపు దిశా అందాలే టార్గెట్ అయ్యాయి. దీంతో ఆ భాగాలపై బ్లర్ కాకుండా నేరుగా ఆ దృశ్యాన్నే తొలగించాలని బోర్డ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇలాంటి సన్నివేశాలు సమాజంలో చెడు సంకేతంగా వెళ్తాయని, ఇప్పటికే సినిమాలపై ప్రభావం యువతపై తీవ్రంగా ఉందని సెన్సార్ అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో మేకర్స్ కూడా అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. మూడు సెకన్ల పాటను ట్రిమ్ చేయనున్నారు. నవంబర్ 14న సినిమా రిలీజ్ అవుతుంది. వాస్తవానికి ఇప్పటికే రిలీజ్ కావాలి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యంగా కారణంగా వాయిదా వేసారు. ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో స్టూడియో గ్రీన్– యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. సూర్య కెరీర్ లో ఇదే తొలి భారీ బడ్జెట్ చిత్రం. ఈ చిత్రం టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ తో తెరకెక్కించారు.

# శంకర్ ని నమ్మని నిర్మాతలు..?




సౌత్ స్టార్ డైరెక్టర్స్ లో ఒకప్పుడు టాప్ 1 లో ఉన్న శంకర్ ఇప్పుడు సక్సెస్ కోసం చాలా కష్టపడుతున్నారు. ఎప్పుడో పది పదిహేనేళ్ల క్రితమే తన కంటెంట్ తో పాన్ ఇండియా లెవెల్ లో సంచలన విజయాలు అందుకున్న శంకర్ ఈమధ్య వరుస ఫ్లాపులతో ఫాం కోల్పోయారు. ఎన్నో భారీ అంచనాలతో వచ్చిన ఇండియన్ 2 సినిమా కూడా నిరాశ పరచడంతో శంకర్ సినిమా అంటే బాబోయ్ అనే పరిస్థితి వచ్చింది.

ఐతే ప్రస్తుతం శంకర్ చరణ్ హీరోగా గేం చేంజర్ సినిమా చేస్తున్నారు. దిల్ రాజు నిర్మాతగా తెరకెక్కుతున్న ఈ సినిమా కొన్నాళు గా సెట్స్ మీద ఉంది. సినిమా రిలీజ్ ఎప్పుడంటూ మెగా ఫ్యాన్స్ ఎంత ఎటాక్ చేస్తున్న చిత్ర యూనిట్ మాత్రం అసలేమాత్రం రెస్పాండ్ అవ్వట్లేదు. అప్పుడెప్పుడో జరగండి సాంగ్ ఒకటి వదిలారు ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. ఐతే ఓ పక్క నిర్మాత దిల్ రాజు గేమ్ చేంజర్ క్రిస్మస్ రేసులో ఉంటుందని అంటున్నా కూడా సినిమాను కచ్చితంగా ఆ డేట్ కి పూర్తి చేస్తారా అన్న డౌట్ ఉంది. అందుకే నేడు వినాయక చవితి సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో సెకండ్ సింగిల్ సెప్టెంబర్ లో ఉంటుందని అనౌన్స్ చేశారు. ఐతే ఎలాగు క్రిస్మస్ కి రిలీజ్ అనుకుంటున్నారు కదా అని డేట్ వేస్తారేమో అనుకుంటే అది మాత్రం రివీల్ చేయలేదు. అంటే శంకర్ సినిమాను డిసెంబర్ కల్లా కూడా పూర్తి చేస్తాడో లేదో అన్న అపనమ్మకం నిర్మాతలకు ఉందని తెలుస్తుంది. ఓ పక్క మెగా ఫ్యాన్స్ మాత్రం శంకర్ అండ్ గేం చేంజర్ టీం మీద చాలా ఫైర్ అవుతున్నారు. గేం చేంజర్ సినిమా లో కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తుంది. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో ఎస్ జే సూర్య, శ్రీకాంత్, సునీల్ లాంటి స్టార్స్ కూడా ఉన్నారు. గ్లోబల్ స్టార్ ఇమేజ్ తెచ్చుకున్న చరణ్ గేమ్ చేంజర్ తో మరో సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఈ సినిమా బిజినెస్ లెక్కలు మెగా ఫ్యాన్స్ ని ఖుషి చేస్తున్న సినిమా లేట్ అవుతున్నందుకు మాత్రం చాలా అప్సెట్ అవుతున్నారు.

# ఎర్ర కోకలో బజ్జీల పాప.. ఒక్కో సెల్ఫీ అదుర్స్ అంతే!

బజ్జీల పాప.. అదేనండీ తెలుగు అమ్మాయి కుషిత కల్లపు.. సోషల్ మీడియా ద్వారా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్న అమ్మడు.. ఆ క్రేజ్ తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన కుషిత.. ఒక్క డ్రగ్స్ కేసుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అయిపోయింది. పబ్ కు వెళ్లింది.. డ్రగ్స్ తీసుకోవడానికి కాదు.. చీజ్ బజ్జీలు తినడానికి అని చెప్పింది. దీంతో బజ్జీల పాపగా ఆమె పేరు మారింది! ఆ తర్వాత ఇన్ స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ గా సూపర్ క్రేజ్ సంపాదించుకుంది. అనేక షార్ట్ ఫిల్మ్స్ లో నటించింది. చాంగురే బంగారు రాజా, మనోహరం సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. గత ఏడాది నీతోనే నేను, అడ్డతీగల చిత్రాల్లో నటించింది. పెళ్లి కూతురు పార్టీ సినిమాలో మెరిసింది. రీసెంట్ గా బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్ తో కలిసి బాబు నెంబర్ 1 బుల్ షిట్ గాయ్ సినిమా చేసింది. కానీ అనుకున్న స్థాయిలో హిట్స్ సాధించలేకపోయింది. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం మూవీలో నటించే ఛాన్స్ అందుకుంది కుషిత. నాలుగు రోజులపాటు షూట్ కు వెళ్లింది. కానీ సినిమా రిలీజ్ అయ్యాక ఆమె కనిపించలేదు. ఈ విషయంపై ఆమెనే తర్వాత క్లారిటీ ఇచ్చింది.



తాను చేసిన సీన్స్ ఎడిటింగ్ లో తొలగించినట్లు తెలుసుకున్నానని తెలిపింది. కాస్త బాధపడినా.. ఇలాంటివి కామన్ కదా అని చెప్పింది. ఇప్పుడు మంచి సినిమా అవకాశాలు అందుకోవాలని చూస్తోంది. అదే సమయంలో నెట్టింట తన అందచందాలతో ఆకట్టుకుంటోంది. ఎప్పటికప్పుడు చీరల్లో అందాలు ఆరబోస్తూ ఫిదా చేస్తుంటుంది. ప్లెయిన్ కలర్ శారీల్లో క్యూట్ గా కనిపిస్తూ ఫ్లాట్ చేస్తుంటుంది. జిమ్ చేస్తున్న పిక్స్ షేర్ చేస్తుంటుంది. మోడ్రన్ డ్రెస్సుల్లో కూడా ఫోటో షూట్ పోస్ట్ చేస్తూ మైమరపిస్తుంటుంది. అలా ఎప్పుడూ ట్రెండింగ్ లోనే ఉంటుంది. తాజాగా కొత్త పిక్స్ పోస్ట్ చేసింది. ట్రెడిషనల్ గా, హొమ్లీగా కుషిత కల్లపు సందడి చేసింది. రెడ్ కలర్ శారీలో సంప్రదాయంగా రెడీ అయ్యి వరుసగా తీసుకున్న సెల్ఫీలు షేర్ చేసింది. హెవీ నెక్ సెట్ వేసుకున్న అమ్మడు.. జడకు మల్లెపూలు పెట్టుకుంది. ఒక్కో సెల్ఫీలో ఒక్కో ఎక్స్ప్రెషన్ ఇస్తూ ఆకట్టుకుంటుంది. కొంటెగా.. ముద్దుగా.. క్యూట్ గా.. అమాయకంగా.. కామెడీగా.. కుషిత ఇచ్చిన పోజులు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. బజ్జీల పాప పిక్స్ అదిరిపోయాయని, ఫ్లాట్ అయ్యామని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు

# శ్రీలీల అలా చేయడమే సేఫ్.. లేకుంటే..

యంగ్ హీరోయిన్ శ్రీలీల.. తన అందం, అభినయంతో ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తన డ్యాన్స్ మూవ్స్ తో సినీ ప్రియులను తెగ మెప్పించింది. ఆమె డ్యాన్స్ లో స్పెషల్ గ్రేస్ కనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అయితే ఇప్పుడు తన టాలెంట్ ను అన్ని ఇండస్ట్రీలకు పరిచయం చేయాలని చూస్తోంది శ్రీలీల. బాలీవుడ్ తోపాటు కోలీవుడ్ లో అడుగుపెట్టేందుకు గ్రాండ్ గా రంగం సిద్ధం చేసుకుంటోంది. టాలీవుడ్ లో వరుస ఫ్లాపులు ఎదుర్కొన్నా.. ఆమెకు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. చిన్న బ్రేక్ తీసుకున్న అమ్మడు.. ఇప్పుడు మళ్లీ బిజీ బిజీగా గడుపుతోంది. సరైన కథలు ఎంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. తెలుగులో ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తోంది అమ్మడు. యంగ్ హీరో నితిన్ సరసన రాబిన్ హుడ్ మూవీలో యాక్ట్ చేస్తోంది. ఆమె రోల్ కు సంబంధించిన గ్లింప్స్.. మేకర్స్ రీసెంట్ గా రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ ల్యాండ్ మార్క్ 75వ చిత్రంలో యాక్ట్ చేస్తోంది శ్రీలీల. పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా ఆమెనే హీరోయిన్ అయినప్పటికీ.. ప్రస్తుతం ఆ మూవీ షూటింగ్ హోల్డ్ లో ఉంది.



అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ విషయం వైరల్ గా మారింది. రీసెంట్ గా వచ్చిన ఓ సినిమాను రిజెక్ట్ చేసి శ్రీలీల మంచి పని చేసిందని ఫ్యాన్స్ చెబుతున్నారు. లేకుంటే మరో ఫ్లాప్ తన ఖాతాలో వేసుకునేదని అంటున్నారు. ఆ సినిమా ఏంటంటే.. విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్– ది గోట్. రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన గోట్ మూవీలో సీనియర్ నటి త్రిష ఓ స్పెషల్ సాంగ్ చేసిన విషయం తెలిసిందే. ఆ పాట అంతగా హిట్ అవ్వలేదు.. మూవీ రిజల్ట్ కూడా అలానే ఉంది. అయితే ఆ సాంగ్ ఆఫర్ ముందు శ్రీలీల వద్దకు వచ్చింది. కానీ ఆమె రిజెక్ట్ చేసింది. స్టార్ హీరో సినిమా కదా అని వెంటనే యాక్సెప్ట్ చేయకుండా.. కాస్త ఆలోచించి ఆఫర్ ను వదులుకుంది. గోట్ మేకర్స్.. ఆమెకు భారీ రెమ్యునరేషన్ ఇస్తామన్నా కూడా శ్రీలీల రిజెక్ట్ చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఐటెం సాంగ్ చేస్తే.. మళ్లీ సినీ ప్రియుల్లో వేరేలా ముద్రపడుతుందని ఆలోచించిందేమో! అందుకే ఆ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. అయితే మెగాస్టార్ చిరంజీవి అప్ కమింగ్ మూవీ విశ్వంభరలోని ప్రత్యేక గీతం కోసం కూడా మేకర్స్ ఆమెను ఇటీవల సంప్రదించారట. ఆ ఆఫర్ నూ శ్రీలీల రిజెక్ట్ చేసినట్లు సమాచారం.



# కీలక సమావేశం వాయిదా

## విభజన సమస్యలపై సమావేశం వాయిదా..

హైదరాబాద్ / అమరావతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న విభజన సమస్యల పరిష్కారానికి కేంద్ర హెూంశాఖ ఈ రోజు ఢిల్లీలో ఏర్పాటు చేసిన కీలక సమావేశం వాయిదా పడింది. తదుపరి తేదీలను ఇరు రాష్ట్రాలతో చర్చించి వెల్లడిస్తామని హెూంశాఖ వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాల విభజన జరిగి పదేళ్లయినప్పటికీ, ఇంకా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాలను కలిసి విభజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలోనే కేంద్ర హెూంశాఖ తాజాగా సమావేశం ఏర్పాటు చేసింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు, ఇరు రాష్ట్రాలకు చెందిన వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొనాల్సి ఉన్న ఈ సమావేశం వాయిదా పడటంతో మరికొంత కాలం విభజన సమస్యలపై ప్రతిష్టంభన కొనసాగనుంది.




## మేం సియోల్ నుంచి వచ్చేలోపే గత ప్రభుత్వ కుంభకోణం పేలుతుంది: పొంగులేటి

హైదరాబాద్: గత ప్రభుత్వంలో అనేక అవకతవకలు జరిగాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ధరణి, ఇతర నాలుగైదు కుంభకోణాలు చేశారన్నారు. "కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళి లోపే టపాసులా పేలుతుంది. మేం సియోల్ నుంచి హైదరాబాద్‌లో దిగేలోపే పేలుతుంది. అరెస్టు చేయలా.. జీవితకాలం జైలులో పెట్టాలా అనేది చట్టం చూసుకుంటుంది. ఆస్తుల రికవరీ కూడా చట్టమే చూసుకుంటుంది.. మా నిర్ణయం కాదు. తాతలు, తండ్రుల ఆస్తుల్లాగా చట్టాలను అతిక్రమించి సంపాదించారు. వారంతా ఫలితాలు అనుభవిస్తారు" అని పొంగులేటి తెలిపారు.




సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచామన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు. కొల్లూరు, ఈదుల నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## పార్టీ ఫిరాయింపులను జీర్ణించుకోలేకపోతున్నా: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్: ఫిరాయింపుల వల్ల క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. తీవ్ర మానసిక బాధతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పార్టీ ఫిరాయింపులను నేను జీర్ణించుకోలేకపోతున్నాను. తీవ్ర మానసిక బాధతో ఖర్గేకు లేఖ రాస్తున్నా. లేఖ రాస్తున్నందుకు విచారిస్తున్నా. కొన్ని స్వార్థపూరిత శక్తులు అభివృద్ధి నెపంతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నాయి" అని జీవన్‌రెడ్డి విమర్శించారు.



## మూసీ ప్రాజెక్టును కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకోవాలనుకుంటోంది: బండి సంజయ్



హైదరాబాద్: మూసీ నిర్వాసితుల ఇళ్ల కూల్చివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. "కాళేశ్వరం ప్రాజెక్టును భారాస ఏటీఎంలా వాడుకుంది. మూసీని కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకోవాలనుకుంటోంది. ఈ ప్రాజెక్టు పేరుతో రూ.లక్షన్నర కోట్లు అప్పు చేయడం దుర్మార్గం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. వడ్డీల రూపంలో 10నెలల్లోనే రూ.60వేల కోట్లు చెల్లించారు. పాలకులు చేస్తున్న అప్పులతో ప్రజలపై భారం పడుతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. మూసీ ప్రక్షాళనకు భాజపా వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ దోపిడీ, పేదల ఇళ్ల కూల్చివేతకు మాత్రమే వ్యతిరేకం. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం ఇందిరాపార్కు వద్ద భాజపా ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నాం"అని బండి సంజయ్ తెలిపారు.







## సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన

సూర్యాపేట: తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గురువారం సూర్యాపేటలో పర్యటించారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను ఆయన పరిశీలించారు. అంతకుముందు ఆయనకు జిల్లా నాయకలు ఘనస్వాగతం పలికారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఉన్నత స్థాయి కమిటీ ఆదేశాలతోనే డీపీఆర్‌లో మార్పులు.. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ ఈఎన్సీ



హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ విచారణకు విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన్ను విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. ఆనకట్టల నిర్మాణం, నాణ్యత, నిబంధనలు, నిర్వహణపై పలు ప్రశ్నలు వేశారు. గతంలోనూ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఆయన్ను నేడు మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. నల్లా వెంకటేశ్వర్లుపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజాలు, దస్త్రాల ఆధారంగానే సమాధానాలు చెప్పాలంది. కమిషన్ ముందు నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. కాళేశ్వరం డీపీఆర్‌పై నిర్ణయం ఎప్పుడు, ఎవరు తీసుకున్నారని ఆయన్ను ప్రశ్నించారు. 2016లో అప్పటి సీఎం ఆదేశాలతో నిర్ణయం జరిగిందని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన అప్పటి సీఎందేనని తెలిపారు. సమీక్షకు పిలిచేవరకు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదం తర్వాతే డీపీఆర్ మార్పులు జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. దానికి వెంకటేశ్వర్లు అవునని సమాధానమివ్వగా.. మార్పులు ఎవరు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ఉన్నత స్థాయి కమిటీ ఆదేశాలతో మార్పులు జరిగినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. 3 ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని వ్యాప్కోస్ సూచించిందన్నారు. ప్రభుత్వం, అధికారుల ప్రమేయం లేకుండానే వ్యాప్కోస్ ఎలా సూచిస్తుందని కమిషన్ ప్రశ్నించింది.

## కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌కు బెయిల్



హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు (%ఝఅఆ ఝరవతీ%) బెయిల్ మంజూరైంది. తనని లైంగికంగా వేధించారన్న మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెండు వారాలుగా ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదవడంతో ఆయనకు ప్రకటించిన నేషనల్ అవార్డును నిలిపివేస్తున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కూడా పొందారు. తాజాగా మరోసారి తనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. జానీపై కేసు నమోదైందిలా...: జానీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హెూటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్‌లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా ఇబ్బంది పెట్టాడు" అని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

## 2 లక్షల ఉద్యోగాలు కాదు.. ఉన్నవి తీసేస్తున్నారు: కేటీఆర్



హైదరాబాద్: 165 మంది ఏఈవోలు, 20 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం దారుణమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కాంగ్రెస్ అంటే ఉద్యోగుల సంక్షోభ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. అడ్డగోలు సాకులతో వారిని సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. హక్కులు అడిగితే సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాల మాట అటుంచితే.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారని విమర్శించారు. ఎల్లప్పుడూ ప్రభుత్వ ఉద్యోగులకు భారాస అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సస్పెండ్ చేసిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీపై తమ్మినేని సెన్సేషనల్ కామెంట్స్

ఖమ్మం, అక్టోబర్ 24: బీజేపీపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నిస్తోందని, అలాగే వాగ్దానాలను నెరవేర్చలేని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో బీజేపీకి గతంలో కంటే తక్కువ సీట్లు వచ్చాయని తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంపైనా సీపీఎం నేత పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని చెబుతూనే, రైతు బంధుపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీది దుర్మార్గపు సిద్ధాంతమని తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యలు చేశారు. గురువారం జిల్లాలోని నేలకొండపల్లి మండలం ముఠాపురం మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టె పని బీజేపీ చేస్తోందని ఆరోపించారు. వాగ్దానాలను అమలు చేయలేని స్థితిలో బీజేపీ ఉందన్నారు. ఈ విధానం కొనసాగితే దేశం విచ్ఛినం అవుతుందని అన్నారు. బీజేపీని గద్దె దించడానికి ఇండియా కూటమి ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ వర్గ స్వభావం తమకు తెలుసన్నారు. బీజేపీ పరిపాలన కొనసాగితే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. బీజేపీ గతంలో కంటే సీట్లు కోల్పోయిందని.. చావు తప్పి కన్నులొట్ట పోయి అధికారంలోకి వచ్చిందంటూ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కుటుంబ పరిపాలనతో, అవినీతితో వ్యతిరేక వచ్చిందన్నారు. కాంగ్రెస్ చాలా బలహీనంగా ఉన్నప్పటికీ కేసీఆర్ మీద కోపంతో గెలిచిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోందంటూ సంచలన కామెంట్స్ చేశారు. రుణమాఫీ పూర్తిగా అమలు జరగలేదన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com